


RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక



## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326



రంగారెడ్డి | సంపుటి : 2 సంచిక : 292 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | శుక్రవారం 17 జనవరి 2025 | వెల : 4/-





### చైనాకు చెక్ పెట్టేందుకు
## భారత్ రెడీ

- స్పేస్‌లో అడుగుపెట్టే ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్
- యూఎస్, రష్యా, చైనా దేశాల తర్వాత అంతరిక్షంలో స్పేడెక్స్ డాకింగ్ ప్రయోగం విజయవంతం
- భారత అంతరిక్ష ప్రయోగాలను మరో మలుపు తిప్పగలిగే సంక్లిష్ట ప్రయోగం సక్సెస్ కావడంతో.. అంతటా ప్రశంసలు

# ఢిల్లీలో రేవంత్ బిజీబిజీ



- రాష్ట్రాభివృద్ధిపై పలు కేంద్రమంత్రులతో కీలక భేటీ
- ఢిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రులు భూపేందర్ యాదవ్, కుమారస్వామితో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- రీజనల్ రింగ్ రోడ్, పర్యాటక శాఖకు సంబంధించి కొన్ని అటవీ భూముల నుంచి అభివృద్ధి పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది
- ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకి అవకాశాలు, భారీ పరిశ్రమలకు సంబంధించి ప్రోత్సాహకాల కోసం కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామిని కోరినట్టు తెలుస్తోంది
- పెట్టుబడులే లక్ష్యంగా సీఎం రేవంత్ బృందం విదేశాల్లో పర్యటించనుంది.

**న్యూఢిల్లీ**

ఢిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రులు భూపేందర్ యాదవ్, కుమారస్వామితో భేటీ అయ్యారు సీఎం రేవంత్ రెడ్డి. రీజనల్ రింగ్ రోడ్, పర్యాటక శాఖకు సంబంధించి కొన్ని అటవీ భూముల నుంచి అభివృద్ధి పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే పంపించిన ప్రతిపాదనలను వెంటనే క్లియర్ చేయాలని భూపేందర్ యాదవ్‌ను సీఎం రేవంత్, మంత్రి కొండా సురేఖ కోరారు. దీనికి సానుకూలంగా స్పందించారు భూపేంద్ర యాదవ్. తెలంగాణలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకి అవకాశాలు, భారీ పరిశ్రమలకు సంబంధించి ప్రోత్సాహకాల కోసం - మిగతా3లో




### పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టులో
## బీఆర్ఎస్ పిటిషన్

- పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్
- 4 వారాల్లో స్పీకర్ నిర్ణయం తీసుకునేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి
- ఆ తీర్పును కొట్టేసిన తెలంగాణ హైకోర్టు

**న్యూఢిల్లీ**

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 10 మంది ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసి 9 నెలలవుతున్నా స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని పిటిషన్‌లో పేర్కొంది. కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్‌కు వ్యతిరేకంగా ఎస్ఎల్‌పీ దాఖలు చేయగా, మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా రిట్ పిటిషన్‌ను దాఖలు చేశారు. హైకోర్టు తీర్పు ఇచ్చి 6 నెలలైనా ఇప్పటికీ స్పీకర్ చర్యలకు ఉపక్రమించలేదని బీఆర్ఎస్ తెలిపింది. కనీసం నోటీసు కూడా ఇవ్వలేదని పిటిషన్‌లో పేర్కొంది. గతంలో కేశం మేఘా చంద్ర కేసులో ఇచ్చిన తీర్పు - మిగతా3లో




### ప్రపంచంలోనే 3వ అతిపెద్ద స్టార్టప్ ఎకో సిస్టమ్‌గా భారత్

- తొమ్మిదేళ్ల ప్రస్థానంలో కీలక మైలురాయి
- భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ
- స్టార్టప్ ఇండియా, రాష్ట్ర-స్థాయి విధానాలు, అలాగే పెరుగుతున్న ప్రతిభ, డిజిటల్ కనెక్టివిటీ వంటి ప్రభుత్వ కార్యక్రమాలతో మౌలిక సదుపాయాల బలమైన మద్దతు
- భారతీయ స్టార్టప్‌లు దేశీయ సవాళ్లను పరిష్కరించడమే కాకుండా ప్రపంచ సమస్యలను పరిష్కరిస్తున్నాయి
- తక్కువ ఖర్చుతోనే మానవ వనరులను పొందగల్గడం భారత్‌లోనే సాధ్యపడుతోంది

## ఉద్యోగుల కోసం 8వ పే కమిషన్ ఏర్పాటు

- శ్రీహరికోటలో కొత్త లాంచ్ ప్యాడ్ నిర్మాణం
- కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు
- 1947 నుంచి ఇప్పటివరకు 7 వేతన సంఘాలు ఏర్పాటు
- ప్రస్తుతం ఉన్న పే కమిషన్ 2016లో ఏర్పాటు అయింది
- ఆ వేతన సంఘం గడువు 2026లో ముగుస్తుంది





### ఛత్తీస్‌గఢ్‌లో
## ఎన్‌కౌంటర్

- 17 మంది నక్సల్స్ హతం..!
- నక్సలైట్లకు గట్టి ఎదురుదెబ్బ
- దక్షిణ బస్తర్ ప్రాంతంలో ఎన్‌కౌంటర్
- అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు భారీ స్థాయిలో యాంటీ నక్సల్ ఆపరేషన్



### సీఎంకు సంక్రాంతి
## ఆఫర్ ఇస్తున్నా

- లై డిటెక్టర్ పరీక్షకు నేను రెడీ, మీరు రెడీనా? : కేటీఆర్
- ఎన్నిసార్లు పిలిచినా వస్తా, ఎన్నిప్రశ్నలు వేసినా సంతృప్తికర సమాధానం ఇస్తానన్న కేటీఆర్
- అడిగిన ప్రశ్నలనే తిప్పి తిప్పి అడిగారని వ్యాఖ్యలు
- రేవంత్‌రెడ్డికి సంక్రాంతి ఆఫర్ ఇస్తున్నానని ప్రకటన

**హైదరాబాద్**

ఏసీబీ లాగానే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా అడిగిన ప్రశ్నలనే మళ్లీ మళ్లీ అడిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. 7 గంటల పాటు కొనసాగిన ఈడీ విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అడిగిన ప్రశ్నలనే తిప్పి తిప్పి అడిగారని, విచారణకు ఎన్నిసార్లు పిలిచినా వస్తానని ఈడీకి చెప్పినట్లు కేటీఆర్ తెలిపారు. రేవంత్‌పై ఈడీ కేసు ఉందనే తాను - మిగతా3లో

# పథకాల జాతర

### తెలంగాణ ప్రజలకు పండుగలాంటి వార్త..
### ఒకేసారి నాలుగు పథకాలు అమలు..

- ఈనెల 26 నుంచి తెలంగాణలో రెండో విడత సంక్షేమ పథకాల జాతర షురూ
- రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా..
- మొత్తం నాలుగు పథకాలు అమల్లోకి రాబోతున్నాయ్.
- లబ్ధిదారుల ఎంపికను యుద్ధప్రాతిపదికన మొదలుపెట్టింది ప్రభుత్వం
- క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి... గ్రామ సభల్లో చర్చించి.. ఆ తర్వాతే అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించాలన్నది ప్రణాళిక




**హైదరాబాద్**

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు సన్నాహాలను ప్రారంభించింది. ఇప్పటికే.. మహిళలకు ఉచిత బస్సు, రూ.500 గ్యాస్ సిలిండర్, ఫ్రీ కరెంట్, ఆరోగ్యశ్రీ సాయం రూ.10లక్షలకు పెంపు తదితర వాటిని అమలు చేసింది.. రైతులకు రుణమాఫీ సైతం చేసింది.. అయితే.. మరికొన్ని పథకాలను క్షేత్రస్థాయిలో ప్రారంభించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది.. మరికొన్ని రోజుల్లో మరో నాలుగు కొత్త పథకాలు ప్రారంభించేందుకు సిద్ధమైంది. జనవరి 26 నుంచి రైతు భరోసా పంట పెట్టుబడి సాయం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, - మిగతా3లో

# చైనాకు చెక్ పెట్టేందుకు భారత్ రెడీ




భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఖాతాలో మరో ఘనత. గురువారం (జనవరి 16, 2025) తెల్లవారుజామున తొలిసారి అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను అనుసంధానం చేసి చారిత్రాత్మక విజయం సాధించింది. యూఎస్, రష్యా, చైనా దేశాల తర్వాత డాకింగ్ ప్రయోగం విజయవంతం చేసిన నాలుగో దేశంగా నిలిచింది. ఈ విషయాన్ని 'ఎక్స్' వేదికగా వెల్లడించింది ఇస్రో. భారత అంతరిక్ష ప్రయోగాలను మరో మలుపు తిప్పగలిగే సంక్లిష్ట ప్రయోగం సక్సెస్ కావడంతో.. అంతటా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. భవిష్యత్తులో అంతరిక్షంలో భారత స్పేస్ స్టేషన్ ఏర్పాటుకు, చంద్రునిపై మానవున్ని పంపేందుకు ఈ సాంకేతికత చాలా అవసరం. గతేడాది డిసెంబర్ 30న శ్రీహరి కోట లాంచ్ ప్యాడ్ నుంచి పీఎస్ఎల్‌బిసి60 ద్వారా 220 కిలలోల బరువున్న రెండు ఉపగ్రహాలు ఎస్‌డిఏక్స్01(ఛేజర్) ఎస్‌డిఏక్స్02(టార్గెట్)లను నింగిలోకి పంపించింది ఇస్రో. ఒకే రాకెట్‌పై ప్రయోగించిన రెండు ఉపగ్రహాలు అంతరిక్షంలోకి వెళ్లగానే విడిపోయాయి. వాస్తవానికి డాకింగ్ ప్రక్రియ జనవరి 7న షెడ్యూల్ చేయబడినప్పటికీ అనేక మార్లు వాయిదా పడింది. చివరకు జనవరి 16న అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను విజయవంతంగా అనుసంధానించి.. యూఎస్, రష్యా, చైనా దేశాల తర్వాత అంతరిక్షంలోడాకింగ్ ప్రయోగం విజయవంతంగా అమలు చేసిన నాలుగో దేశంగా నిలిచి చరిత్ర సృష్టించింది.

ఈ సందర్భంగా, "రాబోయే సంవత్సరాల్లో భారతదేశం చేపట్టబోయే ప్రతిష్టాత్మక అంతరిక్ష యాత్రలకు ఇది ఒక ముఖ్యమైన మెట్టు" అని ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించారు."భవిష్యత్తులో భారత అంతరిక్ష కేంద్రం, చంద్రయాన్ 4, గగన్‌యాన్ ఆశయాలను సాధించేందుకు స్వదేశీ భారత డాకింగ్ సిస్టం విజయం బాటలు వేసింది" కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ, అంతరిక్ష శాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్ ఇస్రో బృందాన్ని ప్రశంసించారు.

**డాకింగ్ అంటే ఏమిటి? ఎందుకంత ప్రాధాన్యం?**

అంతరిక్షంలో వేగంగా సంచరిస్తున్న రెండు ఉపగ్రహాలను మన్నుషుల్‌గా లేదా వాటంతట అవే ఒకే కక్ష్యలోకి తీసుకురావడాన్ని 'డాకింగ్ ప్రక్రియ' అంటారు. ఉదాహరణకు అంతరిక్షంలో స్పేస్ స్టేషన్ నిర్మించుకునేందుకు భారీ మాడ్యూల్స్ భూమి నుంచి పంపడం సాధ్యం కాదు. ఈ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తే భారీ అంతరిక్ష నౌకలు అవసరమయ్యే మిషన్లను నిర్వహించడం సులభమవుతుంది. స్పేస్ స్టేషన్‌ను ఏర్పాటుకే కాక ప్రత్యేక మాడ్యూల్స్ అంతరిక్షంలో కలిపేందుకు, సిబ్బంది, సామగ్రిని తీసుకెళ్లడానికి కూడా ఈ సామర్థ్యం అవసరం.

**డాకింగ్ ప్రయోగం విజయవంతం చేసిన దేశాలు..**

యునైటెడ్ స్టేట్స్: 1966లో నాసా ప్రయోగించిన జెమిని లక్ష్యవాహక నౌక అజేనాతో డాకింగ్ చేసిన మొదటి అంతరిక్ష నౌకగా నిలిచింది. ఈ మిషన్ 1969లో చంద్రునిపై అడుగు పెట్టిన మొదటి మానవుడు నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ నేతృత్వంలో జరిగింది.

సోవియట్ యూనియన్: 1967లో సోవియట్ యూనియన్ మానవరహిత కాస్మస్ 186, కాస్మస్ 188లను ఆటోమేటెడ్ విధానంలో విజయవంతంగా ప్రయోగించింది. చైనా: 2011 లో మానవరహిత షెంజౌ 8 వ్యోమనౌకను టియాంగాంగ్ 1 అంతరిక్ష ప్రయోగశాలతో విజయవంతంగా డాక్ చేసి చైనా తన డాకింగ్ సామర్థ్యాన్ని ప్రదర్శించింది. ఒక సంవత్సరం తర్వాత చైనా వ్యోమగాములు మాన్యువల్‌గా షెన్‌జౌ 9 వ్యోమనౌకను అదే అంతరిక్ష ప్రయోగశాలతో డాక్ చేశారు.

**భారతదేశం స్పేడెక్స్ డాకింగ్ మిషన్‌ను ఎందుకు నిర్వహించింది?**

2035 నాటికి అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసి, 2040 నాటికి మానవులను చంద్రునిపైకి పంపాలని ఇస్రో లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు అవసరమయ్యే సాంకేతికతలు సమకూర్చుకోవడంలో భాగంగా ఈ స్పేడెక్స్ డాకింగ్ ప్రయోగం చేపట్టి విజయవంతంగా పూర్తిచేసింది. హెవీ-లిఫ్ట్ లాంచ్ వెహికల్‌తో పాటు 30 టన్నుల బరువును భూమి సమీప కక్ష్యకు మోసుకెళ్లాలంటే డాకింగ్ సామర్థ్యం అవసరం. భారతీయ అంతరిక్ష స్టేషన్ నిర్మించేందుకు 5 రకాల మాడ్యూళ్లను అంతరిక్షంలోకి పంపాలని భావిస్తోంది. ఇందులో మొదటిదైన రోబోటిక్ మాడ్యూల్ 2028లో లాంచ్ చేయనుంది. చంద్రయాన్ 4 ప్రయోగం ద్వారా చంద్రునిపై నుంచి నమూనాలు సేకరించాలని భావిస్తోంది ఇస్రో. ఇందుకోసం రెండు వేర్వేరు ప్రయోగాల ద్వారా ఐదు కీలక మాడ్యూళ్లను కక్ష్యలోకి పంపాలని ప్రణాళికలు రచిస్తోంది. మొదటి ప్రయోగంలో నాలుగు మాడ్యూళ్లను పంపిస్తారు. ప్రొపల్షన్ మాడ్యూల్ భూమి కక్ష్య నుండి చంద్రుని కక్ష్యకు అంతరిక్ష నౌకను మోసుకువెళుతుంది, అక్కడ నుంచి ల్యాండర్, అసెండర్ మాడ్యూళ్లు చంద్రుని ఉపరితలంపైకి వెళ్లి నమూనాలను సేకరిస్తాయి. ఆ నమూనాలను తీసుకెళ్లి అసెండర్ మాడ్యూల్ చంద్రుని కక్ష్యలోని ట్రాన్స్‌ఫర్ మాడ్యూల్‌కు డాక్ చేస్తుంది. తర్వాత ట్రాన్స్‌ఫర్ మాడ్యూల్ ఆ నమూనాలను భూమి కక్ష్యకు తీసుకొస్తుంది. అక్కడ రీ-ఎంట్రీ మాడ్యూల్‌తో డాక్ అయ్యి విడిగా లాంచ్ అవుతుంది. భూ వాతావరణంలోని వేడిని తట్టుకునేలా ఈ మాడ్యూల్‌ను రూపొందించనున్నారు. ఈ మిషన్‌కు సన్నాహకంగా, చంద్రయాన్-3 మిషన్ ముగింపు సమయంలో ఇస్రో "హాప్ ప్రయోగం" చేసింది

**భారతీయ డాకింగ్ సిస్టమ్ అంటే ఏమిటి?**

కొన్నేళ్లుగా స్పేస్ ఏజెన్సీలు కొన్ని ఇంటర్‌ఆపరేబిలిటీతో కలిపి అనేక రకాల డాకింగ్ మెకానిజమ్‌లు ఉపయోగిస్తున్నాయి. ఇంటర్నేషనల్ డాకింగ్ సిస్టమ్ స్టాండర్డ్ ని అనుసరించి వ్యోమనౌకలు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళతాయి. ఇది మొదట 2010లో బేస్‌లైన్ చేయబడింది. భారతదేశ ఉపయోగించే డాకింగ్ మెకానిజం ఆండ్రోజినస్ - అంటే ఛేజర్, టార్గెట్ శాటిలైట్‌లలోని సిస్టమ్‌లు ఒకేలా ఉంటాయి. ఇది ఇతర ఏజెన్సీలు ఉపయోగించే %xబావా% మాదిరిగానే ఉంటుంది. అయితే %xబావా%లో 24 ఉపయోగిస్తే, ఇక్కడ రెండు మోటార్లనే వాడతారు. ఈ మిషన్‌లో రెండు ఉపగ్రహాలను దగ్గరకు తీసుకువచ్చి కలిపేందుకు లేజర్ రేంజ్ ఫైండర్, రెండెజ్‌వూస్ సెన్సార్, ప్రాక్సిమిటీ, డాకింగ్ సెన్సార్ వంటి అనేక కొత్త సెన్సార్‌లను ఉపయోగించారు.

# ప్రపంచంలోనే 3వ అతిపెద్ద స్టార్టప్ ఎకో సిస్టమ్‌గా భారత్



సరిగ్గా తొమ్మిదేళ్ల క్రితం భారత ప్రభుత్వం ప్రారంభించిన "స్టార్టప్ ఇండియా" దేశాన్ని 3వ అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా తీర్చిదిద్దింది. వ్యాపార, పారిశ్రామిక రంగాలతో పాటు వివిధ రంగాల్లో సరికొత్త ఆలోచనలు, ఆవిష్కరణలతో ముందుకొచ్చే యువతను ప్రోత్సహించడం కోసం ఏర్పడిన స్టార్టప్ ఇండియా 2025 జనవరి 16 నాటికి తొమ్మిదేళ్ల ప్రస్థానాన్ని పూర్తిచేసుకుని 10వ ఏటలోకి అడుగు పెడుతోంది. ఈ సందర్భంగా జనవరి 16ను కేంద్ర ప్రభుత్వం నేషనల్ స్టార్టప్ డే గా పేర్కొంటూ.. తొమ్మిదేళ్ల ప్రయాణంలో అధిగమించిన మైలురాళ్లు, సాధించిన విజయాలను వెల్లడించింది.

భారత ప్రభుత్వం "స్టార్టప్ ఇండియా" పేరుతో సరికొత్త ఆలోచనలతో వచ్చే యువతకు ఆర్థిక వనరులు కల్పించడం, వివిధ శాఖల నుంచి అనుమతులు కల్పించడంలో సహకరిస్తూ ప్రోత్సహిస్తూ వచ్చింది. దీనికి తోడు ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన భారత్‌లో ఇంజినీరింగ్, సైన్స్ రంగాల్లో చదువుకున్న యువత కూడా పెద్ద సంఖ్యలో ఉండడం కలిసొచ్చింది. సాంకేతిక పరిజ్ఞానం కలిగిన మానవ వనరులే భారతదేశానికి ఒక ఆస్తిలా మారాయి. వీటన్నింటికీ మించి ప్రపంచంలోని ఏ ఇతర దేశంతో పోల్చినా సరే ఇక్కడ తక్కువ ఖర్చుతో కంపెనీలను ఏర్పాటు చేయడం, తక్కువ ఖర్చుతోనే మానవ వనరులను పొందగల్గడం భారత్‌లోనే సాధ్యపడుతోంది. ఇవన్నీ ప్రస్తుతం భారత్‌ను స్టార్టప్ ఎకోసిస్టమ్‌లో 2-3 స్థానాల్లో నిలబెడుతోంది. మొదటి స్థానంలో అమెరికా కొనసాగుతుండగా.. 2-3 స్థానాల్లో భారత్, యునైటెడ్ కింగ్‌డమ్ అటూ ఇటూగా కొనసాగుతున్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో కెనడా, జెర్మనీ ఉన్నాయి.

డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ గణాంకాల ప్రకారం 9 సంవత్సరాల క్రితం భారతదేశంలో కేవలం 500 స్టార్టప్ కంపెనీలు మాత్రమే ఉండేవి. ఇప్పుడు 1.59 లక్షల స్టార్టప్ కంపెనీలు, వాటిలో 100కు పైగా యూనికార్న్ కంపెనీలతో ప్రపంచస్థాయిలో భారతదేశం దూసుకుపోతోంది. ఈ తొమ్మిదేళ్లలో 16 లక్షలకు పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టించిన రంగంగా రికార్డుల్లో నిలిచింది. జొమాటో, ఓలా, జీరోధా, జెప్టో, బ్లింకిట్, క్రెడ్ డిలైట్ వంటి నిత్యజీవితంలో ఉపయోగించే అనేక రకాల ఈ-కామర్స్, ఫిన్‌టెక్ యాప్స్ అన్నీ స్టార్టప్‌లే అన్న విషయం మరువరాదు. ఇవన్నీ స్థానిక మార్కెట్లో అనేక సవాళ్లను పరిష్కరించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొదాయి. దేశ ముఖచిత్రాన్ని మార్చేసి, ఆర్థిక పురోగతిలో భాగమయ్యాయి.

**స్టార్టప్ ఇండియాలో కొన్ని విశేషాలు**

భారత్‌లో స్టార్టప్‌ల సంఖ్య 1,59,157

2024 అక్టోబర్ నాటికి మొత్తం 73,151 గుర్తింపు పొందిన స్టార్టప్‌లలో కనీసం ఒక మహిళా డైరెక్టర్ ఉన్నారు.

ఈ 9 సంవత్సరాలలో, గుర్తింపు పొందిన స్టార్టప్‌లు 16.67 లక్షల ఉద్యోగాలను సృష్టించాయి

ఏయే రంగాల్లో సృష్టించిన ఉపాధి ఎంత?

ఐటీ సేవలు - 2.04 లక్షలు

హెల్త్ కేర్ అండ్ లైఫ్ సైన్సెస్ - 1.47 లక్షలు

వృత్తిపరమైన, వాణిజ్య సేవలు - 94, 060

విద్య - 90, 414

స్టార్టప్ ఇండియా చొరవ ప్రత్యేకత ఏమిటి?

వ్యాపారాన్ని సులభంగా చేయడం: ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలతో వ్యాపారాలను ప్రారంభించడం సులభతరం చేయడం

పన్ను ప్రయోజనాలు: స్టార్టప్ ప్రారంభించే వారికి వరుసగా మూడు ఆర్థిక సంవత్సరాలు పన్ను ప్రయోజనాలు లభిస్తాయి.

నిధుల మద్దతు: స్టార్టప్‌ల కోసం రూ. 10,000 కోట్ల విలువైన నిధుల నిధి అందుబాటులో ఉంది.

వివిధ రంగాలకు ప్రత్యేక విధానాలు: బయోటెక్నాలజీ, వ్యవసాయం, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాలకు సంబంధించిన కేంద్రీకృత విధానాలు.

'డెవలప్ ఇండియా యంగ్ లీడర్స్ డైలాగ్'లో భారతదేశ స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను మరింత విస్తరించాలని ప్రధానమంత్రి మోదీ కోరుకున్నారు. నేటి భారతదేశం కొత్త ఉత్సాహంతో ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. నేడు భారతదేశం ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని, అదే సమయంలో నేడు ప్రపంచంలోనే నంబర్ వన్ ఫిన్‌టెక్ ఎకో సిస్టమ్ భారతదేశంలో ఉందని తెలిపారు. ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌గా భారత్ నిలవడం గర్వంగా ఉందని తెలిపారు. అలాగే భారతదేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద మొబైల్ తయారీ దేశంగా కొనసాగుతోందని వెల్లడించారు. భవిష్యత్తులో భారతదేశం ప్రపంచ అభివృద్ధికి కేంద్రంగా మారుతుందని, ఇది ప్రపంచ వృద్ధి ఇంజిన్‌గా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

PEDDA KARMA



With Profound Grief And Sorrow We Inform
The Sad Demise Of Our Beloved
Sanem Pentamma Garu
Who Left For Her Heavenly
Abode On The Day
07/01/2025 at 10:50am
Pedda Karma Will Be Lunch
Held On 19/01/2025 Follows 12:30pm
At
Sri TLM Gardens Function Hall
kattedan , Old Kurnool Rd,
Hyderabad, 500077
GRIEF STRICKEN
SANEM'S FAMILY

# కారులో కట్టలు.. లెక్క పెట్టడానికే..

న్యూఢిల్లీ, జనవరి 16: ఉత్తరప్రదేశ్‌లోని కోశంబి జిల్లాలో ఎన్నో నేరాలు చేసిన గ్యాంగ్‌స్టర్ నక్షు యాదవ్.. తన పేరును సందలాల్ యాదవ్‌గా మార్చుకొని నకిలీ పత్రాలు సృష్టించుకొని పోలీస్ శాఖలో దాదాపు 35 ఏళ్ల పాటు హోంగార్డ్‌గా విధులు నిర్వహించాడు. అతడి బండారం కాస్తా ఇటీవల బహిర్గతమైంది. దీంతో ప్రజలే కాదు.. పోలీస్ శాఖ సైతం ముక్కున వేలేసుకొంది. తాజాగా మరో ఉదంతం ఇటీవల వెలుగులోకి వచ్చింది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఆర్టీవో కార్యాలయంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన సౌరభ్ శర్మ వందల కోట్ల ఆస్తులు చూసి.. ఆ రాష్ట్ర రాజకీయాల్లో సైతం అలజడి మొదలైంది. ఇంతకీ ఏం జరిగిందంటే.. భోపాల్ నగర శివారులోని మెండోరి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్.. తన పొలం పనుల్లో నిమగ్నమై ఉన్నాడు. ఇంతలో ఆ సమీపంలో ఇన్నోవా కారును పార్క్ చేసి.. అందులో నుంచి ఇద్దరు వ్యక్తులు దిగారు. దీంతో మాజీ సర్పంచ్‌కు కాస్తా ఆసక్తి కలిగింది. కొన్ని రోజులుగా ఆ కారు అక్కడ ఉంది. దీనిని తీసుకు వెళ్లేందుకు ఎవరు రాలేదు. కారు సమీపంలోని వెళ్లి చూస్తే.. కారు ప్లేట్ మీద ఆర్‌టీవో అని రాసి ఉంది. కారు అద్దాల్లో నుంచి లోపలికి చూశాడు.అందులో భారీ ఎత్తున బ్యాగులు ఉన్నట్లు గుర్తించాడు. దీంతో స్థానిక రాతిబాద్ పోలీస్ స్టేషన్‌కు ఫోన్‌లో సమాచారం అందించాడు. దీంతో పోలీసులు హుటాహుటిన కారు వద్దకు వచ్చి పరిశీలించారు. ఆదాయపు పన్ను శాఖకు సమాచారం అందించారు. వారి సమక్షంలో కారు అద్దాలు పగల కొట్టగా.. అందులో భారీగా నగదు, కిలోల కొద్దీ బంగారాన్ని ఉన్నట్లు గుర్తించారు. వాటిని ఆదాయపు పన్ను శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ కారు ఆర్టీవో కార్యాలయంలో విధులు నిర్వహించిన సౌరభ్ శర్మదిగా గుర్తించారు. దీంతో అతడి నివాసంపై లోకా యుక్త పోలీసులు, ఐటీ, ఈడీ అధికారులు దాడులు చేసి కోట్లాది రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఆదాయపు పన్ను శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న కారు సౌరభ్ శర్మ స్నేహితుడి పేరు మీద ఉన్నట్లు గుర్తించారు. ఇక సౌరభ్ శర్మతో పాటు అతడి స్నేహితులు సైతం పరారీలో ఉన్నట్లు గమనించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్



ఛత్తీస్‌గఢ్‌లోని దక్షిణ బస్తర్ ప్రాంతంలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 17 మంది నక్సలైట్లు హతమయ్యారు. బీజాపూర్ జిల్లా ఊసూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పూజారీ కాంకేర్, మారేడుబాక ప్రాంత అడవుల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి భద్రతా బలగాలు, నక్సల్స్ మధ్య కాల్పులు జరుగుతున్నాయి. ఈ నెలలో ఇది రెండో ఎన్‌కౌంటర్. మూడు జిల్లాలకు చెందిన డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), ఐదు బెటాలియన్ల సీఆర్పీఎఫ్, కోబ్రా, సీఆర్పీఎఫ్ 229వ బెటాలియన్ బలగాలు నక్సల్స్ ఉన్న ప్రాంతాన్ని చుట్టుముట్టి కాల్పులు జరిపాయి. ఇదే జిల్లాలో ఈ నెల 12న జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మహిళా నక్సల్స్‌తోపాటు ఐదుగురు నక్సలైట్లు మరణించారు.

## గోద్రా రైలు ఘటనపై ఫిబ్రవరి 13న సుప్రీంకోర్టులో విచారణ



**న్యూఢిల్లీ:** 2002లో జరిగిన గోద్రా రైలు ఘటనపై.. ఫిబ్రవరి 13వ తేదీన విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. గుజరాత్ ప్రభుత్వంతో పాటు అనేక మంది దాఖలు చేసిన పిటీషన్లపై విచారణ చేపట్టనున్నది. ఈ కేసు విచారణకు మరో తేదీని ఇవ్వబోమని జస్టిస్ జేకే మహేశ్వరి, అరవింద్ కుమార్‌తో కూడిన ధర్మాసనం తెలిపింది. 2002, ఫిబ్రవరి 27వ తేదీన సబర్మతి రైలుకు చెందిన ఎస్-6 బోగీలో చెలరేగిన మంటల్లో సుమారు 59 మంది ప్రయాణికులు మరణించారు. ఆ కేసులో 2017లో గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ అనేక మంది సుప్రీంలో అప్పీల్ చేసుకున్నారు. జీవిత ఖైదు శిక్ష పడిన 11 మంది నిందితులకు మరణశిక్ష విధించాలని కోరుతూ గత ఏడాది ఫిబ్రవరిలో గుజరాత్ సర్కారు సుప్రీంను ఆశ్రయించింది. అయితే గురువారం విచారణ సమయంలో ఓ నిందితుడి తరపున లాయర్ హాజరయ్యారు. కానీ ఆధారాలు సమర్పించలేకపోయారు. గత ఏడాది నుంచి ఈ కేసును ఇప్పటి అయిదు సార్లు వాయిదా వేశారని, ఇక మళ్లీ వాయిదా వేయబోమని జస్టిస్ మహేశ్వరి తెలిపారు. కొందరు నిందితులకు చెందిన క్షమాభిక్ష పిటీషన్లు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నట్లు సుప్రీంకు లాయర్ తెలిపారు. గుజరాత్ ప్రభుత్వ అప్పీల్‌పై ముందుగా విచారణ చేపట్టాలని సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే కోరారు.

## ఉద్యోగుల కోసం 8వ పే కమిషన్ ఏర్పాటు



కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు మోదీ సర్కార్ శుభవార్త చెప్పింది. లక్షలాది మంది ఉద్యోగుల జీతాలు, విశ్రాంత ఉద్యోగుల పింఛన్లు పెంచేందుకు 8వ వేతన సంఘం ఏర్పాటు చేస్తున్నట్లు గురువారం ప్రకటించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దిల్లీలో సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

"1947 నుంచి ఇప్పటివరకు 7 వేతన సంఘాలు ఏర్పాటు అయ్యాయి. జావ్యానికి తావులేకుండా వేతన సంఘాలు ఏర్పాటు చేయాలని ప్రధాన మంత్రి సంకల్పించుకున్నారు. అందుకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నాం. ప్రస్తుతం ఉన్న పే కమిషన్ 2016లో ఏర్పాటు అయింది. ఆ వేతన సంఘం గడువు 2026లో ముగుస్తుంది. ఆ గడువుకన్నా ముందే, 2025లోనే 8వ వేతన సంఘం ఏర్పాటు చేయడం ద్వారా సరిపడా సమయం దొరుకుతుంది. 7వ పే కమిషన్ గడువు ముగియడానికి ముందే వేతనాల పెంపుపై సిఫార్సులు పొందేందుకు వీలు కలుగుతుంది. కొత్త కమిషన్‌కు ఛైర్మన్?, ఇద్దరు సభ్యులను త్వరలోనే నియమిస్తాం" అని కేంద్ర మంత్రి తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు, భత్యాలు ఎంత ఉండాలో నిర్ణయించడంలో వేతన సంఘం కీలక పాత్ర పోషిస్తుంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని- ప్రస్తుతమున్న జీతాలు, పింఛన్లను ఎంత మేర పెంచాలో ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుంది. ఈ నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం వేతన సవరణ చేపడుతుంది.

**ఇస్రోకు మరింత శక్తి**

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట అంతరిక్ష పరిశోధన కేంద్రం-షార్‌లో మూడో లాంచ్‌ప్యాడ్ నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఇందుకోసం రూ.3,985కోట్లు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. భారీ ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టగల నెక్స్ట్ జనరేషన్ లాంచ్ వెహికల్-ఎన్‌జీఎల్‌వీ ప్రయోగాలకు వీలు కల్పించే కొత్త లాంచ్‌ప్యాడ్ నిర్మాణాన్ని రోదసీ పరిశోధన రంగానికి అవసరమయ్యే మౌలిక వసతుల అభివృద్ధిలో కీలక మైలురాయిగా అభివర్ణించారు.

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఓ ప్రకటన ప్రకారం- భారత్ త్వరలో చేపట్టబోయే మానవ సహిత అంతరిక్ష ప్రయోగాలకు షార్‌లో కొత్తగా నిర్మించబోయే లాంచ్‌ప్యాడ్ ఉపకరించనుంది. ఎన్‌జీఎల్‌వీ ప్రయోగాలకు మాత్రమే కాక- సెమీక్రయోజెనిక్ స్టేజితో కూడిన ఎల్‌వీఎమ్3 ప్రయోగాలకూ వేదిక కానుంది. నాలుగేళ్లలో మూడో లాంచ్‌ప్యాడ్ నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# పథకాల జాతర

-మొదటిపేజీ తరువాయి
ఇందిరమ్మ ఇళ్ల పథకాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేయనుంది.. ఈ నేపథ్యంలో వీటికి సంబంధించి లబ్ధిదారుల జాబితా తయారీకి ప్రభుత్వం ఇవాళ్టి నుంచి ఫీల్డ్ సర్వే చేపట్టనుంది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి అధికారులను ఆదేశించారు. గురువారం నుంచి ఫీల్డ్ సర్వే తర్వాత.. ఈ నెల 21నుంచి 24 వరకు గ్రామసభలు, డేటా ఎంట్రీ చేయనున్నారు. ఈ డేటా ఆధారంగా తుది జాబితాకు మంత్రులు ఆమోదం తెలపనున్నారు.

**రైతు భరోసా..**
ఇక రైతు భరోసా కోసం అధికారులు క్షేత్రస్థాయిలో సన్నాహక చర్యలు ప్రారంభించారు. ఈ నెల 26న సాగుకు అనుకూల భూములకు మాత్రమే పెట్టుబడి సహాయం ఎకరానికి రూ.12 వేలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో దీనిపై అధికారులు సర్వేకు సిద్ధమయ్యారు. ఈనెల 20 వరకు సర్వే జరుగనుంది. సర్వే అనంతరం సాగుకుయోగ్యం కాని భూముల లిస్ట్?ను గ్రామ పంచాయతీల్లో డిస్?ప్లే చేస్తారు. 21 నుంచి 25 వరకు గ్రామ సభలు నిర్వహించి ఆమోదం తీసుకుంటారు. జనవరి 26న రైతు భరోసా డబ్బులను అర్హులైన రైతుల ఖాతాలో జమ చేయనున్నారు.

**కొత్త రేషన్ కార్డులు..**
గణతంత్ర దినోత్సవం ఈ నెల 26 నుంచి పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఆహార భద్రత రేషన్ కార్డులు జారీ కానున్నాయి. కొత్త రేషన్ కార్డుల మంజూరుతోపాటు.. పాత రేషన్ కార్డులలో మార్పులు, చేర్పులు కూడా చేయనున్నారు. కేబినెట్ సబ్ కమిటీ సిఫారసులకు అనుగుణంగా రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరగనుంది. దరఖాస్తులను నిశితంగా పరిశీలించిన తర్వాత కుల గణన సర్వే ఆధారంగా రేషన్ కార్డులు లేని కుటుంబాల జాబితాను జిల్లా కలెక్టర్, కమిషనర్‌లకు క్షేత్రస్థాయి పరిశీలన నిమిత్తం పంపిస్తారు. అనంతరం గ్రామసభల్లో జాబితాను ప్రకటించనున్నారు.

**ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం..**
ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద రైతు కూలీలకు ఏడాది 12 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని సైతం తెలంగాణ ప్రభుత్వం చేయనుంది.. ఇది కూడా జనవరి 26 నుంచి అమలు చేయనుంది..

**ఇందిరమ్మ ఇళ్ల పథకం..**
అలాగే.. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సైతం ప్రారంభించనుంది.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ఇప్పటికే క్షేత్రస్థాయిలో సర్వే పూర్తయింది.. ఇళ్ల లబ్దిదారులకు పలు విడతల్లో రూ.5లక్షలను ఇవ్వనుంది.
ఈనెల 26 నుంచి తెలంగాణలో రెండో విడత సంక్షేమ పథకాల జాతర షురూ కాబోతోంది. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా.. మొత్తం నాలుగు పథకాలు అమల్లోకి రాబోతున్నాయ్. ఇందుకోసం లబ్ధిదారుల ఎంపికను యుద్ధప్రాతిపదికన మొదలుపెట్టింది ప్రభుత్వం. క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి%ౌ% గ్రామ సభల్లో చర్చించి.. ఆ తర్వాతే అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించాలన్నది ప్రణాళిక. అమలు కార్యాచరణ కోసం జిల్లా కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు చీఫ్ సెక్రటరీ శాంతికుమారి. ఎటువంటి అపోహలకు తావు లేకుండా లబ్దిదారుల ఎంపిక జరగాలని, నిజమైన అర్హులకే లబ్ధి దక్కేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా రైతు భరోసా అమలు దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది రేవంత్ ప్రభుత్వం. గత ప్రభుత్వంలో అసలైన రైతుల కంటే నకిలీ రైతుల జేబుల్లోకే ఎక్కువగా రైతుబంధు నిధులు వెళ్లాయని భావించిన సర్కార్.. తమ హయాంలో ఇటువంటి లూప్‌హోల్స్ లేకుండా అమలు చేయాలని డిసైడైంది.
ముఖ్యంగా రైతుభరోసా పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది రేవంత్ ప్రభుత్వం. సాగులో ఉన్న భూమి కోసం ఏటా 12వేలు పెట్టుబడి సాయంగా అందజేయాలన్నది ప్రభుత్వ సంకల్పం నుంది. అధికారంలోకి వస్తే ఎకరాకు ఏడున్నర వెయ్యి చొప్పున రెండు పంటలకూ కలిపి 15 వేలు జమ చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బట్టి దీన్ని 12వేలకు కుదించింది రేవంత్ సర్కార్. భూభారతి పోర్టల్ నుంచి పట్టదారు పాస్ పుస్తకాలున్న రైతుల వివరాలను మండల వ్యవసాయ అధికారులకుఅందజేసింది ప్రభుత్వం. ఈ డేటా ఆధారంగా రెవెన్యూ అధికారితో కూడిన ప్రత్యేక బృందాలు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. వ్యవసాయ యోగ్యం కాని భూములు ఎక్కడ..? గ్రామాల్లో ఇళ్లు, కాలనీలుగా మారిన భూములేంటి? రియల్ ఎస్టేట్ వెంచర్లు, రోడ్లుగా మారిన భూములు, పరిశ్రమలకు, గోదాములకు, మైనింగ్‌కు వినియోగిస్తున్న భూములు.. ఇలా క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రతీ సర్వేనెంబర్‌ను పరిశీలించి%ౌ% వ్యవసాయయోగ్యం కాని ప్రతీ సెంటునూ లెక్క తేల్చడమే టార్గెట్. రాళ్లు-రప్పలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, నివాస స్థలాలకు రైతు భరోసా ఇచ్చి ప్రజాధనాన్ని వృధా చేయకుండా ఈ సర్వే దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అధికారుల సర్వేకు రైతులనుంచి కూడా మద్దతు లభిస్తోంది.
గ్రామాల్లో ఒక్కో సర్వే నెంబర్‌ను డిజిటల్ మ్యాప్స్, జిపిఎస్ ద్వారా పరిశీలిస్తారు. 19వ తేదీ వరకు ఐదు రోజుల పాటు సర్వే చేసిన తర్వాత.. సేకరించిన వివరాలను గ్రామ సభలో చదివి వినిపిస్తారు. 24వ తేదీ వరకు అభ్యంతరాల్ని స్వీకరించి.. చర్చిస్తారు. 25వ తేదీ నాటికి తుదిజాబితాను జిల్లా కలెక్టర్లు నిర్ధారించి ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తారు. ఇన్‌చార్జ్ మంత్రులతో ఆమోదం తీసుకుంటారు. 26 నుంచి అర్హులైన రైతులకు రైతు భరోసా అమలు చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 68 లక్షల 99 వేల మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలున్నాయి. ధరణి రికార్డుల ప్రకారం మొత్తం భూమి 1.52 కోట్ల ఎకరాలు. ఇందులో సాగు చేయని భూములు తీసేస్తే కోటి 30 లక్షల ఎకరాలు మాత్రమే మిగులుతాయని, వీటికి మాత్రమే రైతు భరోసా అందుతుందని ప్రాథమిక అంచనా వేసింది ప్రభుత్వం. ఇందుకోసం 7 వేల 625 కోట్లు అవసరమౌతుంది. తహసిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, వ్యవసాయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల సిబ్బంది.. అందరూ ఈ నాలుగురోజుల పాటు ఉరుకులు పరుగుల మీద సర్వే చేస్తారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా లబ్దిదారుల ఎంపిక చేసి డేటా సిద్ధం చేస్తారు.

# సీఎంకు సంక్రాంతి ఆఫర్ ఇస్తున్నా

-మొదటిపేజీ తరువాయి
ఏ తప్పు చేయకున్నా చట్టాలను గౌరవించే పౌరుడిగా విచారణకు వచ్చానని, ఒక్క రూపాయి అవినీతి చేయలేదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డిపై ఈడీ కేసు ఉందని, అందుకే తనపై కూడా కేసు పెట్టించారని కేటీఆర్ ఆరోపించారు. జడ్జి ముందు ప్రత్యక్ష విచారణకు సిద్ధమని, దమ్ముంటే సీఎం రేవంత్‌రెడ్డి రావాలని సవాల్ విసిరారు.

**నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమే**
తనపై పెట్టిన కేసుల్లో లై డిటెక్టర్ పరీక్షకు కూడా తాను సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. తనకు కోర్టులు, జడ్జిలపై నమ్మకం ఉందని, చివరకు న్యాయమే గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తాను తప్పు చేయలేదని, చేయబోనని, తప్పు చేశానని నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమని ఈ సందర్భంగా తెలిపారు.

**లైవ్‌లో లై డిటెక్టర్ పరీక్షకు నేను సిద్ధం.. రేవంత్ సిద్ధమా..?**
రేవంత్ రెడ్డిపై ఏసీబీ, ఈడీ కేసులు ఉన్నాయని చెప్పి.. తనపై కూడా ఏసీబీ, ఈడీ కేసులు నమోదు చేయించి, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈ కేసుల్లో వాస్తవాలు ఏంటో ప్రజలకు తెలియజేసేందుకు తాను లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధం.. రేవంత రెడ్డి సిద్ధమా..? అని కేటీఆర్ సవాల్ విసిరారు. ఈడీ విచారణ ముగిసిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కక్ష సాధింపు చర్యలో భాగంగా ఈ కేసు పెట్టారు. విచారణ సంస్థలను, అధికారులను గౌరవించి ఈ నెల 9న ఏసీబీ విచారణకు హాజరయ్యాను. 16న ఈడీ విచారణకు హాజరయ్యాను. రెండు సంస్థలు కూడా ఒకటే రకమైన ప్రశ్నలు ఏడు గంటల పాటు అడిగారు. అన్ని వివరాలు తీసుకున్నారు. మీరు ఎన్ని సార్లు పిలిచినా వస్తాను. విచారణకు సహకరిస్తాను. రాజ్యాంగాన్ని న్యాయ వ్యవస్థను, కోర్టులను గౌరవించే బిడ్డగా చెబుతున్నా.. ఎన్ని ప్రశ్నలు



అడిగినా సమాధానం చెప్తా.. పూర్తిగా విచారణకు సహకరిస్తాను. తన నిజాయితీని నిరూపించుకుంటానని చెప్పాను అని కేటీఆర్ తెలిపారు. ఏసీబీ, ఈడీ వంటి విచారణ సంస్థలకు విచారించేందుకు రూ. 5 నుంచి 10 కోట్లు ఖర్చు అవుతుందని వార్తా పత్రికల్లో చూశాను. సీఎం రేవంత్ రెడ్డికి ఒక మాట చెప్పలదచులకున్నా.. కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఏసీబీ, ఈడీ కేసు తనపై పెట్టారు. నువ్వంటే దొరికినోడివి.. నేను నిజాయితీపరుడిని.. ధైర్యంగా ఎదుర్కొంటాను. ప్రజాధనం వృథా చేయకుండా ఆ 10 కోట్లతో రైతు రుణమాఫీ, ఆసరా పెన్షన్లు ఇవ్వొచ్చు. నీకు నిజాయితీ, ధైర్యం ఉంటే.. ఏసీబీ జడ్జి, హైకోర్టు న్యాయమూర్తి అయినా.. ఎవరి ముందైనా సరే కూర్చుందాం.. మీరు మొత్తం మీడియాను లైవ్ పెట్టండి.. ఏ ప్రశ్న అడిగినా సరే సమాధానం చెబుతాను. మీపై నమోదైన ఏసీబీ, ఈడీ కేసుల్లో కూడా ప్రశ్నిద్దాం. ఇద్దరికి లై డిటెక్టర్ పరీక్ష పెట్టండి.. అప్పుడు 50 లక్షల్లో ఒడిసిపోతది. భారీగా ఖర్చు పెట్టడం దేనికి..? విచారణ సంస్థల అధికారులు, మీడియా సంస్థల సమయం వృథా అయితోపోంది.. నీకు ధైర్యం ఉంటే నీ జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో అయినా.. న్యాయమూర్తుల ముందైనా, ఈడీ ఆఫీసులోనైనా కూర్చుందాం. నీకు ధైర్యం ఉంటే నీవే తేదీలు, సమయం ప్రకటించు.. నేను కూడా వస్తా. లై డిటెక్టర్ పరీక్ష పెట్టి ఎవరు ఏందో తేల్చుకుందాం అని రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. విచారణకు ఎన్నిసార్లైనా వస్తా.. ఎన్ని పరీక్షలు పెట్టినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాను. న్యాయ వ్యవ్థ మీద నమ్మకం ఉంది. న్యాయం గెలుస్తదనే విశ్వాసం ఉంది. తప్పు చేయలేదు.. అరపైసా అవినీతి జరగలేదు. తప్పు చేసి ఉంటే రుజువు చేయండి.. ఏ శిక్షకైనా సిద్ధమని చెప్పానని కేటీఆర్ తెలిపారు.

# అధికారులు నిబద్ధతతో పనిచేయాలి

హైదరాబాద్: అధికారులంతా నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా పని చేయాలని అన్నారు. అధికారుల మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. ఇవాళ(గురువారం) తెలంగాణ సచివాలయంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి సీతక్క కీలక ఆదేశాలు జారీ చేశారు. అధికారులు నిబద్ధతతో పనిచేసి శాఖ గౌరవాన్ని నిలబెట్టాలన్నారు. శాఖకు వన్నె తెచ్చేలా పనిచేయాలని సూచించారు. శాఖపరంగా వాస్తవాలనే నివేదించాలని అన్నారు. మంత్రుల మెప్పుకోసం వాస్తవాలను దాచి పెట్టొద్దని చెప్పారు. అధికారులు, అమాత్యులు వేర్వురు కాదన్నారు. మీరు పొరపాట్లు చేసి మమ్మల్ని ఇబ్బందుల పాలు చేయొద్దని చెప్పారు. ఎవరూ తప్పులు చేయొద్దు, జైలు పాలు కావద్దని అన్నారు. మీ కింది ఉద్యోగులతో సంప్రదింపులు జరపండి, వారి సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పెండింగ్ బిల్లుల చెల్లింపు ప్రక్రియ ప్రారంభమైందని అన్నారు. రూ. 300 కోట్ల ఎన్ఆర్ఈజీఏ బిల్లులను నిన్న విడుదల చేశామని మంత్రి సీతక్క అన్నారు. మల్టీ పర్పస్ వర్కర్ల వేతన బకాయిలను విడుదల చేశామని చెప్పారు. పంచాయతీరాజ్ శాఖ తరహాలోనే ప్రతి విభాగంలో ఉద్యోగ సమస్యలను ఆన్‌లైన్‌లో పరిష్కరించే విధానాన్ని అవలంబించాలని అన్నారు. అర్హులైన ప్రతి గర్భిణి, బాలింత, చిన్నారికి పోషకాహారం అందించాలని అన్నారు. ఆ దిశలో జిల్లా సంక్షేమ అధికారులను సిద్ధ%శీ% చేయాలని చెప్పారు. అంగన్వాడీ సేవలపై చిన్నారుల పేరెంట్స్ ఫీడ్ బ్యాక్



తీసుకుంటామన్నారు. ప్రతి నెలలో ఒకసారి ఫోన్ ఇన్ విత్ పేరెంట్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. తల్లిదండ్రుల అభిప్రాయాల మేరకు అంగన్వాడీ సిబ్బందిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అంగన్వాడీకి వచ్చే గర్భిణులు కింద కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారి ఇబ్బందులను తొలగించే విధంగా అంగన్వాడి కేంద్రాల్లో బెంచీలు ఏర్పాటు చేయాలని సూచించారు. దివ్యాంగుల పరికరాల కోసం తెలంగాణ చరిత్రలో ఎప్పుడు లేని విధంగా రూ.50 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోని డ్రైవ్ నిర్వహించి దివ్యాంగులకు పరికరాలను అందజేస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## ఢిల్లీలో రేవంత్ బిజీబిజీ

-మొదటిపేజీ తరువాయి
కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామిని కోరినట్టు తెలుస్తోంది. పెట్టుబడులే లక్ష్యంగా సీఎం రేవంత్ బృందం విదేశాల్లో పర్యటించనుంది. ముందుగా సింగపూర్‌కి వెళ్తారు. మూడు రోజుల పాటు అక్కడ పర్యటిస్తారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన సింగపూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌ను సందర్శిస్తారు. నైపుణ్య అభివృద్ధికి సంబంధించిన కోర్సులు, విధానాలపై అధ్యయనం చేస్తారు. తెలంగాణలో నూతనంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ కోసం సింగపూర్ ఐటీఈతో ఒప్పందం చేసుకోనున్నారు. అలాగే సింగపూర్ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తారు. మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్ట్‌కి ఆ .. రివర్ ఫ్రంట్ అభివృద్ధి మోడల్‌ను అనుసరించేందుకు ప్రణాళికలు రూపొందించనున్నారు. స్కిల్ యూనివర్సిటీతో భాగస్వామ్యంపై ఒప్పందాలతో పాటు పెట్టుబడులపై సింగపూర్ పారిశ్రామికవేత్తలతో చర్చించనుంది సీఎం బృందం. అక్కడి నుంచి ఈ నెల 20న స్విట్జర్లాండ్ వెళ్తారు. దావోస్‌లో జనవరి 20, 21, 22న జరగనున్న ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో పాల్గొని, ప్రముఖ కంపెనీలతో సంప్రదింపులు జరుపుతారు. గతంలో దావోస్, అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలతో భారీగా పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురాగలిగిన సీఎం రేవంత్.. ఈ పర్యటనతో తెలంగాణ ఆర్థిక ప్రగతికి మరింత ఊతం కలిగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ పిటిషన్

-మొదటిపేజీ తరువాయి
అమలుచేయాలని కోరింది. పార్టీల ఫిర్యాదులపై స్పీకర్ 3 నెలల్లో నిర్ణయం చెప్పాలని కేశం మేఘా చంద్ర కేసులో తీర్పు రాగా మేఘా అందుకు అనుగుణంగా స్పీకర్ నిర్ణయం తీసుకోవట్లేదని ఆరోపించింది. 4 వారాల్లో స్పీకర్ నిర్ణయం తీసుకునేలా ఆదేశాలివ్వాలని సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేసింది.
బీఆర్ఎస్ తరఫున గెలిచిన స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేంద్ర అధికార పార్టీ కాంగ్రెస్‌లో చేరారు. వారిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కే.పీ. వివేకానంద్‌లు పిటిషన్లు దాఖలు చేశారు. ఎమ్మెల్యేలపై వచ్చిన ఫిర్యాదులను స్పీకర్ ముందుంచాలని, విచారణ తేదీలు నిర్ణయించి 4 వారాల్లో రిజిస్ట్రీకి సమాచారం ఇవ్వాలని సింగిల్ బెంచ్ సెప్టెంబర్ 9న తీర్పు ఇచ్చింది.
ఆ తీర్పును కొట్టేసిన తెలంగాణ హైకోర్టు
సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ అసెంబ్లీ కార్యదర్శి సీజే ధర్మాసనంలో అప్పీలు దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు చీఫ్ జస్టిస్ జస్టిస్ ఆలోక్ అరాధె, జస్టిస్ జె.శ్రీనివాస్ రావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. కేసుపై తీర్పు ఇచ్చిన ఉన్నత న్యాయస్థానం పార్టీ మారిన ఎమ్మెల్యేలపై స్పీకర్ తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలని సూచించింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం, 10వ షెడ్యూల్, అసెంబ్లీ 5 ఏళ్ల గడువును దృష్టిలో ఉంచుకొని స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సీజే ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును హైకోర్టు కొట్టివేసింది.

## ఫోర్త్ సిటీపై ప్రభుత్వం ఫోకస్ ఆరు మండలాల్లో భూసేకరణ!

నాలుగో నగరం ప్రణాళికలు వేగం
ఐటీ సంస్థలు, పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు
ఆరు మండలాల్లో భూముల వివరాలు సేకరణ




తెలంగాణలో కొత్తగా ఐటీ సంస్థలు, పరిశ్రమలను స్థాపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. నాలుగో నగరం చుట్టూ వీటిని ఏర్పాటు చేసేందుకు వీలుగా పట్టా, ప్రభుత్వ భూముల వివరాలను సేకరించేందుకు రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నారు. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో ఔటర్‌కు సమీపంలోని కొన్ని, ఎయిర్ పోర్ట్ దగ్గరగా మరికొన్ని ప్రాంతాలను ఇప్పటికే అధికారులు పరిశీలించారు. 2 జిల్లాల్లో 6 మండలాల్లో కొన్ని గ్రామాలను సూత్రప్రాయంగా రెవెన్యూ అధికారులు ఎంపిక చేశారు. గతంలో పరిశ్రమలకు స్థలాలు ఇచ్చి కార్యకలాపాలు కొనసాగించకపోతే వాటిని వెనక్కితీసుకునేందుకు అవసరం అయిన విధివిధానాలను రూపొందించాలని నిర్ణయించారు.
పరిశ్రమలు-టెక్స్‌టైల్స్
నాలుగో నగరానికి 15 కిలోమీటర్ల విస్తీర్ణంలో పరిశ్రమలు, టెక్స్‌టైల్ హబ్‌లను ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆఫీస్?కి సమీపంలో ఫాక్స్‌కాన్ సంస్థ ఆపిల్ ఫోన్ విడి భాగాల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. షాబాద్ మండలంలో టెక్స్‌టైల్స్, విద్యుత్ బస్సుల తయారీ పరిశ్రమలు ఇప్పటికే తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. కొత్తగా పరిశ్రమల హబ్, ఐటీలతో పాటు విద్యా సంస్థలు, రెస్టారెంట్లు, వినోద కార్యకలాపాలను ప్రారంభిస్తే నాలుగైదు సంవత్సరాల్లో అక్కడ కూడా అభివృద్ధి వేగవంతం అమవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఐటీ, పరిశ్రమల స్థాపనకు ముందే రోడ్లు నిర్మించడం, మొక్కలు నాటడం వంటివి చేపట్టనున్నామని అధికారులు తెలిపారు.
ఒక్కో ప్రాంతంలో కనీసం 1000 ఎకరాలు
ఐటీ సంస్థలు, పరిశ్రమల స్థాపన కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించే భూములన్నీ అన్ని అవసరాలకు అనుకూలంగా ఉండేలా అధికారులు చూస్తున్నారు. మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, మేడ్చల్, ఘట్‌కేసర్ మండలాల పరిధుల్లో ప్రభుత్వ స్థలాల వివరాలను అధికారులు సేకరించారు. ఒక్కో ప్రాంతంలో కనీసం 1000 ఎకరాలు సేకరించాలన్న లక్ష్యాన్ని వారు నిర్దేశించుకున్నారు. సెజ్ తరహాలో ఒకేచోట 200, 300 ఎకరాలు సేకరించాలని, పరిశ్రమలు, ఐటీ సంస్థలకు సమీపంలో ప్రభుత్వ స్థలాలను అభివృద్ధి చేస్తే అక్కడ నివాసం ఉండేందుకు వీలుంటుందని యోచిస్తున్నారు.

## మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుపై కేసు నమోదు

**నాగర్‌కర్నూల్ :** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుపై కేసు నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలోని భ్రమరాంబ ఆలయం వద్ద నిన్న(గురువారం) రాత్రి పోలీసు విధులకు ఆటంకం కలిగించాడని మాజీ ఎమ్మెల్యే బాలరాజుపై ఎస్ఐ రమేశ్ ఫిర్యాదు చేశారు. ఈమేరకు గువ్వల బాలరాజు, పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, కాంగ్రెస్ ఎమ్మెల్యే చిక్కుడు వంశీ కృష్ణ ఆలయంలో ఉన్నాడని, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజును ఆలయంలోకి అనుమతించలేదు. దీంతో గువ్వల బాలరాజు, బీఆర్ఎస్ నేతలు అధికారులు, పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు, గువ్వల బాలరాజు అనుచరుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఆలయం ఎదుటే బైఠాయించి వారు నిరసన తెలిపారు. అయితే నన్ను కావాలనే పోలీసులు ఆలయంలోకి వెళ్లకుండా ఆపారని గువ్వల మండిపడ్డారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్ అనే వ్యక్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే వంశీ కృష్ణతో కుమ్మక్కై నన్ను టార్గెట్ చేసి ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నారని బాలరాజు ఆరోపించారు. న్యాయ వ్యవస్థ సుమోటోగా కేసు స్వీకరించించి తనకు న్యాయం చేయాలని కోరిన విషయం తెలిసిందే.

# సంపాదకీయం

## నిస్సహాయులుగా మార్చే పెట్టుబడిదారీ వ్యవస్థ

ఉత్పత్తి, సామాజిక పునరుత్పత్తిలో ఇమిడి ఉండే వేతన, వేతన రహిత శ్రమ పెట్టుబడి సంచయానికి దోహదం చేస్తుంది. సరుకులు, సేవల ఉత్పత్తికి అవసరమైన శ్రామికశక్తి ఒనగూడడానికి సామాజిక పునరుత్పత్తి సంవిధానం తోడ్పాటు ఇస్తుంది. భారీ ఎత్తున జరిగే సరుకుల ఉత్పత్తిని పెట్టుబడిదారీ వ్యవస్థగా నిర్వచిస్తుంటారు. శ్రామికశక్తిని సరుకుగా మార్చడం పెట్టుబడిదారీ వ్యవస్థ లక్షణం. ఈ క్రమంలో సమాజంలోని శ్రామికులు నిస్సహాయంగా తయారయ్యే పరిస్థితులను నిరంతరాయంగా సృష్టిస్తూ ఉంటుంది పెట్టుబడిదారీ వ్యవస్థ. కార్మికులు తమ శ్రమశక్తిని అమ్ముకున్నందుకు బదులుగా జీతం స్వీకరిస్తారు. కాబట్టి ఇది చెల్లుకు చెల్లు అన్న రీతిలో ఎంత మాత్రం నిర్బంధపూరితం కాని సర్వసాధారణ అంశంగా పైకి కనబడుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పత్తి సాధనాలు ఎవరి ఆధీనంలో ఉంటాయో ఆ యాజమానులకు అదనపు విలువ గడించి పెట్టేలా కార్మికుల శ్రమను దోపిడీ చేస్తారు. యజమానులు లాభాలు, సంపదా పోగేసుకుంటూ ఉంటే కార్మికులు మాత్రం నానాటికీ పేదరికంలోకి జారిపోతూ ఉంటారు. ఉత్పత్తి సాధనాల మీద కార్మికులను హక్కులు లేకపోవడం దీనికి ప్రధాన కారణం. ఆదిమ పెట్టుబడి సంచయం ద్వారా అంటే నిర్బంధపూరిత విధానాల ద్వారా శ్రామికులను నిస్సహాయంగా మార్చడం అనేది ఇంకో పద్ధతి. ఇందులో ప్రత్యక్ష ఉత్పత్తిదారుడిని బలవంతంగా ఉత్పత్తి సాధనాల నుండి వేరు చేసి, ఈ ఉత్పత్తి సాధనాలను పెట్టుబడిగా మలిచి కార్మికులకు తమ శ్రమశక్తిని అమ్ముకోవడం మినహా మరో గత్యంతరం లేని పరిస్థితి సృష్టిస్తారు. అందుకే పెట్టుబడిదారీ వ్యవస్థలో శ్రామికీకరణ ప్రధాన ధోరణిగా కొనసాగుతుంది. అంటే కార్మికులు తమ శ్రమ శక్తిని అమ్ముకుని బదులుగా జీతాలు అందుకుంటారు. పెట్టుబడిదారీ వ్యవస్థ ముదిరాక శ్రామికీరణ మూలంగానే కార్మికులు నిస్సహాయులుగా మారతారని అనుకోనక్కరలేదు. ఎందుకంటే పెట్టుబడి ప్రత్యక్షంగా కార్మికులను పనిలో పెట్టుకోదు. అయితే పెట్టుబడి సంచయం జరిగే క్రమంలో శ్రమశక్తిని కల్పించడానికి కూడా శ్రమ చెయ్యాల్సి ఉంటుంది. ఈ శ్రమ వేతన రహిత శ్రమ కాబట్టి దీనికి పెద్దగా గుర్తింపు ఉండదు. వంట చెయ్యడం, పిల్లలను సాకడం, ఇంట్లో ముసలివాళ్ళకు సేవ చెయ్యడం, కుటుంబంలో సభ్యులందరి మంచి చెడ్డలు చూసుకోవడం ఇవన్నీ ప్రతి ఇంట్లో ఆడవాళ్ళు చేసే పైసా ప్రతిఫలం లేని చాకిరేయే. ఇది ఇంటి పని అని సరిపెడుతున్నారు. కానీ ఇది వేతన రహిత శ్రమ అని వర్ధమాన దేశీల్లోనే కాదు అభివృద్ధి చెందిన దేశాల్లోనూ గుర్తిస్తున్నారు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. 'కుటుంబ ఆదాయం' అనేది విచ్ఛిన్నం కావడం, సంఘటిత రంగంలో ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం, మానవ శ్రమకు బదులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంతో అటు అభివృద్ధి చెందిన దేశాల్లోనూ, ఇటు వర్ధమాన దేశాల్లోనూ వివిధ తరగతుల్లో వేర్వేరు కారణాల రీత్యా వేతన రహిత శ్రమ పెరుగుతూ వస్తున్నది. పెట్టుబడి సంచయానికి ఉత్పత్తి, వినియోగం ఈ రెండూ కీలక అవసరాలే. పెట్టుబడిదారులు ముడిసరుకులు, యంత్రాలు, కార్మికుల శ్రమను కొనుగోలు చేయడానికి పెట్టుబడి పెడతారు. ఉత్పత్తి అయ్యే క్రమంలో అదనపు విలువ ద్వారా పెట్టుబడిదారులకు లాభాలు ఒనగూరుతాయి. అయితే ఈ లాభం పెట్టుబడిదారుడి సొంతం కావాలంటే ఉత్పత్తి అయిన సరుకు మార్కెట్‌లో అమ్ముడుపోవాలి. ఇది జరగాలంటే వాణిజ్య పెట్టుబడి అంటే వాణిజ్యపు ప్రకటనలు, సరుకులు, అమ్మే వ్యాపారులు అవసరం. ఉత్పత్తి అయిన సరుకులు మార్కెట్‌లో అమ్ముడయ్యేందుకు వీలుగా పెట్టుబడిదారుడు వాణిజ్య అవసరాల కోసం అదనపు విలువలో కొంత భాగాన్ని వదులుకోవాల్సి ఉంటుంది. ఈ మొత్తం ప్రక్రియలో శ్రమశక్తి ఇమిడిపోయింది. పెట్టుబడిదారుడు అదనపు విలువను లాభంగా మార్చుకోవడంలో నష్టాన్ని నివారించుకోవడానికి గాను వేతన శ్రమకు బదులు వేతన రహిత శ్రమను వినియోగించుంటారు. కుటుంబ వేతనం విచ్ఛిన్నం కావడంతో ఒక్క జీతంతో కుటుంబ పోషణ గడిచే పరిస్థితి ఉండదు. పూట గడవడం కోసం ఇంట్లో ఆడవాళ్లు కూడా పని వెతుక్కోవాల్సి వస్తుంది. లేదా ఇంట్లో మగ మనిషి పని కోసం పరాయి ఊళ్లోకి వలస వెళితే, మహిళలు ఇంటిపట్టునే ఉండి కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూ వేతనరహిత శ్రమ చేయాల్సి వస్తుంది. పట్టణ ప్రాంతాల్లో కూడా వినియోగక్రమంలో కొనుగోలుదారులు వేతనరహిత శ్రమను అందించడం గణనీయంగా పెరిగింది. తద్వారా పెట్టుబడిదారు వాణిజ్య పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకుంటాడు. బట్టల షాపుల్లో, డిపార్ట్‌మెంట్ స్టోర్లలో ఇతరేతర షోరూముల్లో సేల్స్ సిబ్బందిని గణనీయంగా తగ్గించివేశారు. వెండింగ్ మిషన్లు, టెల్లర్ కౌంటర్లు ఏర్పాటు చేయడం, ఖాతాదారులకు సెల్ఫ్ సర్వీస్ అలవర్చడం ద్వారా రిటైల్ ఖర్చులు తగ్గించుకుంటున్నారు. అంటే వేతన రహిత శ్రమను ప్రజాక్షేత్రంలో కూడా విస్తృతపరిచి అమ్మకాల వ్యయాన్ని తగ్గించుకుంటున్నారు. వాస్తవం ఏమిటంటే వివిధ రూపాల్లో వేతనరహిత శ్రమను పెంపొందిస్తున్నా తద్వారా ప్రత్యక్షంగా లాభాలను ఉత్పత్తి చేయలేరు. వేతన కార్మికుల నుండి ఎంత ఎక్కువగా శ్రమ దోపిడి చేస్తే అంత ఎక్కువ అదనపు విలువను పిండుకుంటుంది పెట్టుబడి. అయితే వివిధ రూపాల్లోని వేతన రహిత శ్రమ.. శ్రమ శక్తిని మరింత చౌకగా మారుస్తుంది. అలాగే పంపిణీ వ్యయాన్ని తగ్గించి మరింత అదనపు విలువ పిండుకోవడానికి వీలవుతుంది. వేతన కార్మికుల సంఖ్యను తగ్గించే, వేతనరహిత శ్రమను అందించే మిషన్లు ప్రవేశపెట్టడం ద్వారా తగ్గించుకుంటూ పోవడంద్వారా నిరుద్యోగం ప్రబలడానికి, కార్మికుల ఉమ్మడి బేరసారాల శక్తి తగ్గిపోవడానికి దారితీస్తుంది. కాబట్టి వేర్వేరు పరిస్థితులలో వేతనశ్రమ, వేతన రహిత శ్రమ మధ్య ఉన్న చలన సూత్రాలను పెట్టుబడి సంచయ స్వభావం నిర్ణయిస్తుంది. లాభాల హెచ్చింపుకు దోహదం చేస్తుంది. వర్ధమాన దేశాల్లోని స్వయం ఉపాధి కార్మికులు చౌక మార్కెట్లలో అమ్ముడుపోయే సరుకులు, సేవలు ఉత్పత్తి చెయ్యడం ద్వారా శ్రామికశక్తి పునరుత్పాదకతకు అవసరమయ్యే వ్యయాన్ని కట్టడి చేసేందుకు చూస్తారు. అలాగే సంఘటిత రంగంలో కాంట్రాక్టీకరణ ద్వారా ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవచ్చు. తద్వారా ఉత్పత్తి, సామాజిక పునరుత్పత్తి రంగాల రెండింటికీ వేతనేతర శ్రమ తోడ్పాటు ఇస్తుంది. వేతన శ్రమ, వేతనేతర శ్రమలు ప్రధాన వేతన ఆదాయానికి ఎలా తోడ్పడతాయనేది ఆయా వర్గాలవారీగా, వేర్వేరుగా ఉంటుంది. శ్రామిక కుటుంబాలలో కుటుంబ వేతనం మీద అంటే ఒక వేతనం మీద ఆధారపడి కుటుంబ పోషణ గడిచే పరిస్థితి లేదు. నిజవేతనాలు స్థంభించిపోవడమో, దిగజారి పోవడం మూలంగానో కుటుంబ పోషణ కోసం మహిళలు కూడా శ్రామిక శక్తిలో భాగస్వామ్యం కావడం నానాటికీ పెరుగుతూ వస్తుంది. ఈ విధంగా కుటుంబంలో ఇద్దరూ పని చేయాల్సి రావడంతో వేతన రహిత శ్రమ అంటే ఇంటి పనులు, బిడ్డల సంరక్షణ వంటి బాధ్యతలు పలుచబడతాయి. ఉన్నత మధ్య తరగతి వర్గాల్లో ఈ పనులు చేసేందుకు పని మనుషులను పెట్టుకుంటారు. అంటే వేతన రహిత శ్రమ స్థానాన్ని వేతన శ్రమ భర్తీ చేస్తుంది. అదే ధనిక దేశాల్లో అయితే ఇంటి సనులు చక్కబెట్టడానికి రకరాల గృహోపకరణ సాధనాలు అందుబాటులోకి వచ్చాయి. అయితే ఇవి కొనే స్థోమత, వీటిని వినియోగించగలిగే సమయం ఉన్న వారికే ఉపయోగకరం. అంటే ధనిక కుటుంబాల వేతన రహిత శ్రమ సామాజిక పునరుత్పత్తి కార్యకలాపాల వ్యయాన్ని తగ్గించడానికి దోహదపడుతుంది. అదే శ్రామిక కుటుంబాల్లో అయితే వాళ్ళ ఆదాయాలు కుటుంబ పోషణకీ బొటాబొటిగా సరిపోతాయి కాబట్టి ఇంటి పనుల కోసం వేరే మనుషులను పెట్టుకునే పరిస్థితి ఉండదు. పర్యవసానంగా వేతన రహిత శ్రమ కుంచించుకుపోయి సామాజిక పునరుత్పత్తి క్రమం అంతే పిల్లల ఆరోగ్యం, చదువులు మున్నగునవి దెబ్బతినిపోతాయి. అంటే వేతన శ్రమ, వేతనేతర శ్రమలు వివిధ తరగతులకు చెందిన ప్రజానీకం మీద వేర్వేరు ప్రభావాలు చూపుతాయని స్పష్టం అవుతున్నది. అంతిమంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రత్యేకించి రోబోట్లు, కృతిమ మేధ వంటి వాటి వినియోగం భవిష్యత్‌లో వేతన శ్రమ, వేతన రహిత శ్రమ మీద ప్రభావం చూపించనున్నది. వేతన శ్రమను వేతన రహిత శ్రమలో భర్తీ చేయడం మూలంగా కార్మికుల నిజ వేతనాలు పడిపోయే అవకాశం ఉంటుంది. సామాజిక పునరుత్పత్తి క్రమం మీద ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన ప్రభావం కారణంగా శ్రమశక్తి ఉత్పత్తి వ్యయం తగ్గుముఖం పడుతుంది.

# అలనాటి మేటి నటి శాంతకుమారి


తెలుగు చిత్ర పరిశ్రమ ఆప్యాయంగా 'అమ్మ' అని పిలుచుకునే నటి శాంతకుమారి అత్యంత పాత తరానికి, తొలి టాకీ చిత్రాల కాలానికి చెందిన సినీ నటి. తెలుగు సినిమా పరిశ్రమలో అలనాటి మేటి కథా నాయకులైన నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, ఎం.జి. రామచంద్రన్, శివాజీ గణేశన్ లతో పలు చిత్రాలలో నటించారు. 250 చిత్రాలలో విభిన్న పాత్రలు పోషించారు. తాను హీరోయిన్‌గా ప్రధాన పాత్రల్లో నటించిన సినిమాలనే మళ్లీ తీసినపుడు తల్లి పాత్రల్లో నటించిన అరుదైన రికార్డు శాంతకుమారి సొంతం. ఎన్‌టి రామారావు నిర్మించి, దర్శకత్వం వహించిన తల్లా పెళ్ళామా చిత్రంలో ఆమె అమ్మమ్మ పాత్ర పోషించారు. ఆమె పేరొందిన దర్శకుడు పి.పుల్లయ్య సతీమణి. 1936లో 'శశిరేఖా పరిణయం' సినిమాతో నటజీవితం ప్రారంభించి వందకు పైగా సినిమాల్లో నటించారు. శాంతకుమారి అసలు పేరు వెల్లాల సుబ్బమ్మ. సుబ్బమ్మ వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరు లో మే 17, 1920 సంవత్సరంలో జన్మించారు. తండ్రి వెల్లాల శ్రీనివాసరావుకు కళలు అంటే ఎంతో ఇష్టం. అందుకనే కూతురైన సుబ్బమ్మను మద్రాసులో ఉన్న ప్రొ.పి. సాంబమూర్తి వద్దకు కర్ణాటక సంగీతం, వయొలిన్ నేర్చు కోవటానికి దరఖాస్తు చేయించారు. డి.కె.పట్టమ్మాళ్... సుబ్బమ్మకు సహాధ్యాయిని. పదమూడేళ్ళ వయసులోనే సుబ్బమ్మ కర్ణాటక సంగీతంలో ఉత్తీర్ణురాలయ్యింది. పదిహేనేళ్ల వయసులో వయొలిన్ లో ఉత్తీర్ణురాలైనారు. తరువాత గురువుతో కలసి దక్షిణ భారతదేశం అంతా ఎన్నో కచేరీలు చేశారు. పదహారేళ్ళ వయసులోనే విద్యోదయా స్కూలులో పిల్లలకు సంగీతం నేర్పించే వారు. పదహారేళ్ళ వయసులో ఆలిండియా రేడియో కళాకారిణి. ఆకాశవాణి కోసం సంగీత దర్శకుడు సాలూరు రాజేశ్వర రావుతో కలిసి పాడారు. సుబ్బమ్మ కచేరి చూసిన దర్శక - నిర్మాత పి.వి.దాసు (పినపాల వెంకట దాసు) మాయా బజార్/శశిరేఖ పరిణయం (1936) సినిమాలో శశిరేఖ పాత్రను ఇచ్చారు. కానీ సుబ్బమ్మ సినిమాలలో నటించటానికి ఆమె బామ్మ నిరాకరించడంతో, పి.వి.దాసు, అయన మేకప్ మన్ మంగయ్య ఒప్పించడానికి ఎంతో ప్రయత్నించారు. సుబ్బమ్మను శశిరేఖ వేషంలో చూసిన ఆమె బామ్మ చివరకు ఆమె సినిమాలో నటించడానికి ఒప్పుకొన్నారు. దాసు, సుబ్బమ్మ కొంచెం పాతగా ఉందని పేరును శాంతకుమారిగా మార్చారు. శాంతకుమారిగా మారిన నట - గాయక సంచలనం తరువాత సినిమా సారంగధర (1937)లో చిత్రాంగి అనే దుష్టపాత్రను ఎంతో ఉత్సాహ భరితంగా పోషించారు. చిత్ర దర్శకుడైన పి.పుల్లయ్యను ఇష్టపడి పెళ్ళి చేసుకొన్నారు. పెళ్ళి చేసుకొన్న



తరువాతకూడ ఆమె నట జీవితం సాఫీగా కొన సాగింది. శాంతకుమారి పి.పుల్లయ్య దంపతులకు రాధ, పద్మ అనే ఇద్దరు కుమార్తెలు కలిగారు. పుల్లయ్య, శాంతకుమారి 1979 లో ముత్తైదువా అనే ఏకైక చిత్రంలో భార్య మరియు భర్తగా నటించారు. శాంత కుమారి సినిమా జీవితం ప్రారంభ దశలో అన్నీ పురాణాలు ఇతివృత్తంగా ఉన్న సినిమాలలోనే నటించారు. యశోదగా కూడా నటించిన ఆమె కృష్ణుని ముద్దుచేస్తూ "చిరు చిరు నగవులు చిందే తండ్రి" అనే మధురమైన పాటను అద్భుతంగా పాడారు. శాంతకుమారికి మెదటి సాంఘిక చిత్రం ధర్మపత్ని. ఈ చిత్రంలో భానుమతి, శాంత కుమారి, రాళ్ల బండి కుటుంబరావు, పెద్దాపురం రాజు, బేలీ లక్ష్మి, ఆరణి సత్యనారాయణ మొదలైన వారు నటించారు. హను మంత రావు అనే నటుడు హీరో పాత్ర ధారి. అందులో అక్కినేని నాగేశ్వరరావు పలువురు విద్యార్థులతో కలిసి, విద్యార్థిగా నటించారు. అక్కినేనికి శాంతకుమారికీ మధ్య ఎంతో ఆత్మీయమైన అనుబంధం ఉండేది. అక్కినేనిని ఆమె అప్యాయంగా చిన్న తమ్ముడిని పిలచినట్లు "అబ్బి" అనే వారు. మాయలోకం సినిమాలో అక్కినేనికి ప్రక్క కథానాయికగా నటించిన శాంతకుమారి, జయభేరి సినిమాలో వదినగా నటించారు, అర్ధాంగి సినిమాలోనైతే సవతి తల్లిగా నటించారు. ఎన్.టీ.ఆర్ కు కూడా తల్లా పెళ్ళామా సినిమాలో బామ్మగా నటించారు. తెలుగు సినీ పరిశ్రమలో అగ్రతారలైన ఎన్.టి. రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, తమిళ సినీ ప్రముఖులు శివాజీ గణేశన్, జెమినీ గణేశన్ తదితరులకు చాలా చిత్రాల్లో శాంతకుమారి తల్లిగా నటించారు. పద్మశ్రీ పిక్చర్స్, రాగిణి పిక్చర్స్ పేరుతో సొంతంగా ఇరవైకి పైగా సినిమాలను నిర్మించారు. తాను హీరోయిన్‌గా ప్రధాన పాత్రల్లో నటించిన సినిమాలనే మళ్లీ తీసినపుడు తల్లి పాత్రల్లో నటించిన అరుదైన రికార్డు శాంతకుమారి సొంతం. తమ కుమార్తె పద్మ పేరు మీద పద్మశ్రీ పిక్చర్స్ పేరును వారి కొన్ని సినిమాలకు ఉపయోగించారు. జయభేరి (1959), శ్రీ వెంకటేశ్వర మహాత్యం (1960), మరియు ప్రేమించి చుడు (1965) వంటి చిత్రాలతో విజయం సాధించారు. శంకరు (1950), అర్ధంగి (1955), శ్రీ వెంకటేశ్వర మహాత్యం (1960), శాంతి నివాసం (1960), రాముడు భీముడు (1964) సహా తన భర్త నిర్మించిన చాలా సినిమాల్లో సంతకుమారి నటించారు. పద్మశ్రీ మరియు రాగిణి బ్యానర్‌లలో వారు 22 సినిమాలు చేశారు. ఆమె సుమారు 250 చిత్రాలలో నటించారు. కృష్ణ ప్రేమ, రేచుక్క, అర్ధంగి 'జయభేరి, ప్రేమ్‌నగర్' ఆమెకు పేరు తెచ్చిన సినిమాలు. సినిమాలలో నటించడం మానేసిన తరువాత ఆమె మంగళంపల్లి బాలమురళీకృష్ణ పాడే పాటలను వ్రాసి, స్వరపరిచే వారు. మాయాబజార్ లేదా శశిరేఖా పరిణయం (1936), సారంగధర (1937), రుక్మిణీ కల్యాణం (1937), భక్త జయదేవ (1938), శ్రీ వేంకటేశ్వర మహాత్యం (1939), ధర్మపత్ని (1941), పార్వతీ కల్యాణం (1941), కృష్ణప్రేమ (1943) (రాధ పాత్ర), మాయా లోకం (1945), గుణసుందరి కథ (1949) (గుణసుందరి దేవి దుష్ట బుద్ధిగల అక్కగా), షావుకారు (1950), ధర్మదేవత (1952) (కాత్యాయిని పాత్ర), అర్ధాంగి (1955), సారంగధర (1957), జయభేరి (1959) (అన్నపూర్ణ పాత్ర), శ్రీ వెంకటేశ్వర మహాత్యం (1960) (వకుళ పాత్ర), సిరి సంపదలు (1962), ప్రేమించి చూడు (1965), ప్రాణమిత్రులు (1967), బంగారు పిచ్చుక (1968), అక్కాచెల్లెలు (1970) (జడ్జి రామచంద్రరావు తల్లి), ప్రేమనగర్ (1971), కొడుకు కోడలు (1972), సోగ్గాడు (1975), అందరూ బాగుండాలి (1976) తదితర చిత్రాలలో నటించారు. 1999వ సంవత్సరానికి గాను ఆమె 'రఘుపతి వెంకయ్య అవార్డు'ను అందుకున్నారు. ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా సినీ కళాకారులకు ఇచ్చే 'కళా నీరాజన' పురస్కారాన్ని కూడా ఆమె పొందారు. తెలుగు వెండి తెర బామ్మ 86 సంవత్సరాల వయస్సులో, సుదీర్ఘ అనారోగ్యంతో జనవరి 17, 2006 న స్వగృహంలో మృతి చెందారు.

# సినీపరిశ్రమ ప్రజ్ఞాశాలి ఎల్‌వి ప్రసాద్

భారతీయ సినిమాకి నడకలు నేర్పిన సినీపరిశ్రమ ప్రజ్ఞాశాలి, తెలుగు సినిమాకు క్లాసిక్ అనదగ్గ సినిమాలు అందించిన దర్శకుడు ఆయన. సినీనిర్మాతగా, దర్శకుడుగా, నటుడుగా సినీ నిఘంటువులో తనకంటూ కొన్ని పేజిలు సృష్టించుకున్న ఉద్దండుడు. మొట్టమొదటి హిందీ టాకీ చిత్రం 'ఆలం అరా'తో పాటు తమిళ 'కాళిదాస్', తెలుగులో 'భక్త ప్రహ్లద' వంటి మూడు భాషల్లో తెరకెక్కిన తొలి టాకీ సినిమాల్లో నటించిన ఘనత ఎల్ .వి ప్రసాద్ సొంతం. దర్శకుడిగా 1949లో వచ్చిన 'మన దేశం' సినిమాతో ఎన్టీఆర్‌ను, ఆయ నతో పాటు షావుకారు జానకి, సావిత్రి లాంటి గొప్ప నటులను వెండి తెరకు పరిచయం చేసిన ఘనత వహించిన గొప్ప వ్యక్తి ఆయన. ఇంతకీ ఆయన ఎవరో తెలుసా!? భారతీయ సినీ రంగానికి ఎనలేని సేవలందించి నందుకు గాను దాదా సాహేభ్ ఫాల్కే అవార్డును అందు కున్న ఎల్.వి.ప్రసాద్. ఎల్.వి.ప్రసాద్ గా ప్రసిద్ధి చెందిన అక్కినేని లక్ష్మీవరప్రసాద రావు తెలుగు సినీనిర్మాత, దర్శకుడు, నటుడు. ఎల్.వి. ప్రసాద్ చలన చిత్రరంగానికి ఎనలేని సేవ చేశారు. హిందీ, తమిళ, తెలుగు భాషలలో తొలి టాకీ చిత్రాలయిన ఆలం ఆరా, కాళిదాస్ మరియూ భక్త ప్రహ్లాద మూడింటిలోనూ ఆయన నటించారు. తెలుగు వారిలో ఆయన ఒక్కరే ఈ ఘనత సాధిం చారు. హిందీ, తమిళ, తెలుగు, కన్నడ వంటి పలు భారతీయ భాషలలో 50 చిత్రాల వరకు ఆయన దర్శకత్వం వహించటం గానీ, నిర్మించటంగానీ, నటించటం గానీ చేసారు. ఎల్.వి.ప్రసాద్ దర్శకత్వంలో పల్నాటి యుద్ధం',' ద్రోహి','సంసారం', 'మిస్సమ్మ', 'అప్పు చేసి పప్పు కూడు' తదితర ఆణి ముత్యాల లాంటి సినిమాలు అందించారు. ఆయన జనవరి 17,1908 లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఏలూరు తాలూకాలోని సోమవరప్పాడు గ్రామంలో అక్కినేని శ్రీరాములు, బసవమ్మ దంపతుల రెండవ సంతానముగా జన్మించారు. రైతు కుటుంబంలో పుట్టిన ప్రసాద్ గారా బంగా పెరిగారు. చురుకైన వారే అయినా




చదువులో ఎప్పుడూ శ్రద్ధ చూపలేదు. ఉరూరా తిరిగే నాటకాల కంపెనీలు, డాన్సు ట్రూపుల డప్పుల చప్పుల్లు ప్రసాద్ ను ఆకర్షించేవి. పాత అరిగి పోయిన సినిమా రీళ్ళను ప్రదర్శించే గుడా రపు ప్రదర్శన శాలల్లో ప్రసాద్ తర చూ వాటిని ఆసక్తిగా చూసేవారు. స్థానిక నాటకాల్లో తరచుగా చిన్న చిన్న వేషాలు వేసేవాతు. ఇదే ఆసక్తి పెద్దయ్యాక కదిలే బొమ్మలు, నటన పై ఆసక్తిని పెంచి సినిమా రంగంలో ప్రవేశించ డానికి పునాదులు వేసింది. 1908 జనవరి 17న జన్మించిన ఎల్.వి.ప్రసాద్ వివాహం సౌందర్య మనోహరమ్మతో జరిగింది. ఒకరోజు ఆయన సినిమాల్లో నటించాలనే కోరికతో జేబులో 100రూ.లతో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి ముంబయికి వెళ్లిన ఆయనకు ఎంతో కష్టపడగా చివరికి "ఆలం అరా" చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. ఆ చిత్రందేశంలోనే తొలి టాకీ సినిమా. అందులో ఎల్.వి. ప్రసాద్ ఓ పాత్ర చేశారు. ఈ చిత్రంలో నటించినందుకు గాను ఎల్.వి.ప్రసాద్‌కు నెలకు 30 రూపాయలను అంద జేశారు. ముంబై వీనస్ ఫిల్మ్ కంపెనీలో చిన్నచిన్న పనులు చేసే సహాయ కుడుగా జీవితాన్ని ప్రారంభించిన ప్రసాద్, శబ్ద చిత్రం "స్టార్ ఆఫ్ ది ఈస్ట్"లో చిన్న పాత్ర పోషించారు. ఆ తర్వాత హెచ్.ఎం.రెడ్డి దర్శ కత్వంలో రూపుదిద్దుకున్న తమిళ చిత్రం కాళిదాస, తెలుగు చిత్రం భక్త ప్రహ్లాదలో ఆయన నటించారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగిన ఎల్.వి.ప్రసాద్ 1950లో విడుదలైన విజయ పిక్చర్స్ వారి "షావుకారు" సినిమాకు "దర్శకత్వం" వహించి పేరు తెచ్చుకున్నారు. ఎన్టీ రామా రావు, జానకి నటిచిన ఈ చిత్రం ఘన విజయం సాధించింది. ప్రసాద్ ప్రొడక్షన్‌ను నెలకొల్పిన ఎల్.వి. ప్రసాద్ హిందీలో మిలన్, ఖిలోనా, ససురాల్, ఏక్ దూజే కె లియే వంటి సూపర్ హిట్ చిత్రాలను నిర్మించి ఎంతో పాపులారిటీ సంపాదించారు. 1931లో ఆలం ఆరా - మొదటి హిందీ టాకీ సినిమా, 1931లో కాళిదాస్ - మొదటి తమిళ టాకీ సినిమా, 1931లో భక్తప్రహ్లాద - మొదటి తెలుగు టాకీ సినిమా, 1933 లో సీతా స్వయంవర్ (హిందీ), 1940లో బోండాం పెళ్ళి (తెలుగు), 1940లో చదువుకున్న భార్య, 1982లో రాజా పార్వాయి (తమిళం), చిత్రాలలో ఆయన నటించారు. మిస్సమ్మ (1955), గృహ ప్రవేశం (1947), పల్నాటి యుద్ధం (1947), ద్రోహి (1948), మన దేశం (1949), సంసారం (1950), షావు కారు (1950) చిత్రాలకు దర్శకత్వం వహించారు. జూన్ 22 1994లో ఈ లోకాన్ని వీడి వెళ్లినా, తన చిత్రాలతో ప్రేక్షకుల మదిలో కొలువై ఉన్నారు. వరల్డ్‌లోనే బెస్ట్ ఐ హాస్పిటల్‌గా ఎంతో పేరు తెచ్చుకున్న ఆయన నెలకొల్పిన 'ప్రసాద్ ఐ ఇన్ స్టిట్యూట్' దేశంలోనే అత్యున్నత నేత్ర చికిత్సాలయంగా పేరొందింది. ఆయన వారసులు దేశంలోనే అతి పెద్ద ఐమాక్స్ థియేటర్‌ను భాగ్య నగరంలో నిలిపారు. ఎల్వీ ప్రసాదు స్మారకార్థం భారత తపాలా శాఖ 2006 సెప్టెంబరు 5న ప్రత్యేక తపాలా బిళ్ళను విడుదల చేసింది.

## కాకలుతీరిన కమ్యూనిస్టు యోధుడు

భారత రాజకీయ రంగంలో అగ్రశేణి నాయకుల్లో ఒకరైన జ్యోతిబసు భారత స్వాతంత్ర్యోద్యమంలో, ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. ఆయన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సి స్టు) తొలితరం నాయకులు, మొదటి పోలిట్ బ్యూరో సభ్యులు. 23 సంవత్సరాలు వరసగా ఒకే రాష్ట్రానికి ముఖ్య మంత్రిగా పనిచేసిన సుదీర్ఘ పాలనా అనుభవ శాలి. ప్రధాని కావడానికి అవకాశం వచ్చినా, పార్టీ నిర్ణయానికి కట్టుబడి పార్టీ ఆదేశానుసారం దూరంగా నిలిచి క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన నిబద్ధత కలిగిన ఆదర్శ నేత ఆయన. సీపీఎం కురువృద్ధుడు జ్యోతిబసు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి 23 సంవత్సరాల పాటు విరామం లేకుండా ముఖ్యమంత్రిగా సేవలం దించి చరిత్ర సృష్టించారు. పశ్చిమ బెంగాల్‌లో రైతాంగ కార్మికులను సమీకరించి రైతాంగ ఉద్యమాల్లో, పీడిత ప్రజల ఉద్యమాల్లో జ్యోతి బసుది పాత్ర మరువ లేనిది. దేశంలో గ్రామ పంచాయతీ వ్యవస్థ ను బలోపేతం చేసి భూ సంస్కర ణలు అమలు చేసి కౌలుదారు లకు, కార్మికులకు రక్షణ కల్పించిన రాష్ట్ర ప్రభుత్వంగా బెంగాల్‌ను తీర్చిదిద్దిన పాలనా సంస్కరణ వాది జ్యోతిబసు. 1914 జూలై 8న కోల్‌కత్తాలో బెంగాలీ మధ్యతరగతి కుటుంబం లో జ్యోతి బసు...నిశికాంత్ బసు, హేమలతా బసు దంపతులకు జన్మించారు. స్థానికంగా కలకత్తా (నేటి కోల్‌కత) లోనే జ్యోతి విద్యా భ్యాసం చేశారు. ప్రెసిడెన్సీ కళా శాలలో బసు తన డిగ్రీ పూర్తి చేశారు. ఉన్నత చదువుల కోసం 1935 లో ఇంగ్లాండు వెళ్ళారు. ఇంగ్లాండులో న్యాయ శాస్త్రంలో విద్యనభ్యసించే సమయంలో గ్రేట్ బ్రిటన్ కమ్యూ నిస్టు పార్టీ వైపు ఆకర్షితులై, రాజకీయాలపై ఆసక్తి పెంచు కున్నారు. 1938లో జవ హర్ లాల్ నెహ్రూ లండన్ పర్యటన సమయంలో సదస్సు నిర్వహణ బాధ్యతను జ్యోతి బసు తీసు కున్నారు సుభాష్ చంద్రబోస్ పర్యటన సమయంలో కూడా జ్యోతి బసు ఏర్పాట్లు చేసారు. 1940లో న్యాయశాస్త్ర విద్య పూర్తి చేసుకొని మిడిల్ టెంపుల్ వద్ద బారిస్టర్‌గా అర్హత సాధించి, అదే సంవత్సరంలో భారత దేశానికి తిరిగి వచ్చారు. 1944లో ట్రేడ్ యూనియన్ ఉద్యమాలలో పాలు పంచుకొని ఆ తరువాత యూని యన్ ప్రధాన కార్యదర్శి అయ్యారు. 1946లో తొలిసారిగా బెంగాల్ శాసనసభకు ఎన్నికయ్యారు. బి.సి. రాయ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమ యంలో శాసనసభలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. 1967లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఓడిపో వడంతో అజయ్ ముఖోపాధ్యాయ నేతృత్వంలోని ప్రభుత్వంలో 1967 నుండి 1969 వరకు పశ్చిమ బెంగా ల్ ఉప ముఖ్య మంత్రిగా వ్యవహ రించారు. 1972 లో రాష్ట్రంలో మళ్ళీ కాంగ్రెస్ గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయగా, జ్యోతి బసు కూడా తన శాసనసభ స్థానంలో ఓటమి పాలైనారు. తర్వాత 1977 జూన్ 21 నుండి 2000 నవంబరు 6 వరకు నిరాటంకంగా జ్యోతి బసు వరుసగా 5 సార్లు ముఖ్య మంత్రిగా పని చేశారు. తద్వారా దేశంలో ఒక రాష్ట్రానికి అత్యధిక కాలం పాటు ముఖ్య మంత్రిగా కొనసాగిన రికార్డును కూడా జ్యోతి బసు నెల కొల్పారు. సి.పి.ఐ (ఎం) పోలిట్ బ్యూరో నిర్ణయం వల్ల 1996లో దేశ ప్రధానమంత్రి అయ్యే అవకాశాన్ని వదులు కున్నారు. 2000లో ముఖ్య మంత్రి పదవి నుండి వైదొలిగిన జ్యోతి బసు జనవరి 17, 2010న 96 సంవత్సరాల వయస్సులో మరణించారు.

# మహిళలకు కుట్టు మిషన్ లు పంపిణీ చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్,జనవరి16(సూర్యరేఖ)**ఉప్పల్ నియోజకవర్గం చర్లపల్లి డివిజన్ పరిధిలోని పారిశ్రామిక ఏరియాలో రోటరీ క్లబ్ కంపెనీలో ప్రముఖ పారిశ్రామిక వేత్త బబ్బూరి బాలరాజుగౌడ్,ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,ల చేతుల మీదుగా 20 మంది మహిళలకు కుట్టు మిషన్ లు పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ. రోటరీ క్లబ్ వారికి అభినందనలు తెలిపారు.మహిళకు ఎంతగానో ఉపయోగపడుతోందని ఆయన అన్నారు.ఇలాంటి కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జరిపోతుల ప్రభుదాస్,దేవేందర్,మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, గుండారపు శ్రీనివాస్ రెడ్డి,బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాసం మహిపాల్ రెడ్డి,మహేష్ కుమార్ గౌడ్,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# ఎలాంటి అవినీతికి తావు లేకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలి





**గత బీఆర్.ఎస్ ప్రభుత్వం హయాంలో అభివృద్ధి విషయంలో నిర్లక్ష్యం ..**

**కాంట్రాక్టర్ నాణ్యత పాటించకపోతే చర్యలు తప్పవు..**

**పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు**



**పెద్దపల్లి,జనవరి16(సూర్యరేఖ)**పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపాలిటీలోని పూసల 13 వార్డ్ లో ప్యాకేజీ -8 ద్వారా టియుఎఫ్ఐడిసి రూ.38 లక్షలతో నిర్మించబోయే నాలుగు సీసీ రోడ్లు,స్ట్రోమ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణానికి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణరావు మాట్లాడుతూ...అన్ని రంగాల్లో సుల్తానాబాద్ ను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు చెప్పారు.ఇప్పటికే సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో రూ.15 కోట్లతో రోడ్లు, డ్రైనేజీల తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్టు చెప్పారు.అవినీతికి తావు లేకుండా నాణ్యతతో అభివృద్ధి పనులు చేస్తున్నట్టు తెలిపారు. మరో ఆరు మాసాల్లో ఈ పనులు పూర్తవుతాయని,గత బీఆర్ఎస్ పాలనలో అప్పటి పాలకులు సుల్తానాబాద్ మున్సిపల్ పరిధి పట్ల సవతితల్లి ప్రేమ చూపారన్నారు. అలాగే ప్రజలు అభివృద్ధి పనులకు సహకరించాలని ఆయన కోరారు.సుల్తానాబాద్ పట్టణ అభివృద్ధికి ఈ పనులు ఆరంభం మాత్రమేనని, భవిష్యత్తులో పట్టణ రూపురేఖ లను మార్చే అనేక అభివృద్ధి పనులను చేపడతామని ఎమ్మెల్యే విజయరమణరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు,సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాయిరి మహేందర్, డి.దామోదర్ రావు,వేగోళం అబ్బయ్య గౌడ్,సిద్ధ తిరుపతి, ఆరెపల్లి రాజేందర్,కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రావడానికి జైపాల్ రెడ్డి ఎంతో కృషి





**ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జీ మందముల పరమేశ్వర్ రెడ్డి**

**ఉప్పల్,జనవరి 16(సూర్యరేఖ)** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, తెలంగాణ సాధనలో కీలక భూమిక పోషించిన నాయకుడు ఉత్తమ పార్లమెంటేరియన్ స్వర్గీయ సూదిని జైపాల్ రెడ్డి జయంతి సందర్భంగా వారికి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేంనరేందర్ రెడ్డి తోకలిసి గురువారం నెక్లెస్ రోడ్డులో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మంద ముల పరమేశ్వర్ రెడ్డి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భం గా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ. ప్రత్యేక తెలంగాణ కోసం హైకమాండ్ పై ఒత్తిడి తెచ్చారని పేర్కొన్నారు. పార్లమెంట్ లో తెలంగాణ బిల్లు మూజువాణి ఓటుతో ఎలా పాస్ చేయాలో జైపాల్ రెడ్డి స్పీకర్ కు అడ్వైస్ ఇచ్చారని,ఆయన అన్ని విషయా ల్లో మంచి నైపుణ్యం నాయకుడని ప్రశంసించారు.ఈనాటి రాజకీయ నాయకులు జైపాల్ రెడ్డిని ఆదర్శంగా తీసుకొని ముందుకు పోవాలని, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఎన్నో సార్లు అవార్డు అందుకున్న ఘనత ఆయనకే దక్కిందన్నారు. హైదరాబాద్ నగరానికి మెట్రో ట్రైన్ వచ్చిందంటే జైపాల్ రెడ్డి కృషి ఫలితమే అని పరమేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

## బాబులు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన ఆకారపు అరుణ్ పటేల్..




**ఉప్పల్,జనవరి16 (సూర్యరేఖ)** హబ్సిగూడ డివిజన్ నవరంగ్ గూడకి చెందిన జాజిమోగాలా బాబు (బాబులు) అకాల మృతి చెందారు.విషయం తెలుసుకున్న ఉప్పల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు.అనంతరం వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పేదలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో హబ్సిగూడ డివిజన్ సెక్రటరీ సబ్బీర్,గౌస్,పరన్,డీజే రాజు,బాబీ,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..




**నిజాంపేట,జనవరి16(సూర్యరేఖ)** మండల పరిధిలోని నార్లపూర్ ఉన్నత పాఠశాలలో 2006-07 బ్యాచ్ కు సంబంధించి గురువారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...17 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులం ఒకే వేదికపై కలుసుకోవడం సంతోషంగా ఉందని,విద్యార్థి దశలో ఉన్నప్పుడు వారు చేసిన తీపి జ్ఞాపకాలను మరోసారి నెమరు వేసుకున్నారు. తమతోపాటు ముగ్గురు విద్యార్థులు అకాల మరణం చెందగా వారి ఆత్మ శాంతి చేకూరాలని పూర్వ విద్యార్థులు మౌనం పాటించారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులకు మేమోటోస్ అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహ, రవీందర్,దేవేందర్, శ్రీనివాస్, సంజీవ్,నరథ్యం, వెంకటస్వామి, విద్యార్థులురాజేందర్, మల్లేష్,కర్ణాకర్,లక్మి రెడ్డి,వేణు,నరేష్,తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతు సెల్ టవర్ ఎక్కి హల్ చల్..




**నిజాంపేట,జనవరి16(సూర్యరేఖ)** మండల కేంద్రంలో చల్మెడ గ్రామానికి చెందిన రైతు బొమ్మేన నారాయణ నిజాంపేటకు చెందిన మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి,కి చెందిన ఐదు ఎకరాల పొలంను కౌలుకు చేస్తూ ఉండేవాడు.అతనికి నాలుగు సంవత్సరాల నుండి పండించిన పంట డబ్బులు ఇవ్వడం లేదని,గత నాలుగు రోజుల క్రితం రైతు నారాయణ, శ్రీనివాస్ రెడ్డితో గొడవ పడగా శ్రీనివాస్ రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి.రైతు నారాయణపై పోలీసులు కేసు నమోదు చేయడంతో రైతు నాకు న్యాయం చేయాలంటూ బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ఎక్కి హల్చల్ చేశాడు.దీంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని రైతు నారాయణకు న్యాయం చేస్తామని పోలీసులు నచ్చజెప్పడంతో రైతు నారాయణ సెల్ టవర్ దిగాడు.దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

# ఆదాబ్ హైదరాబాద్ క్యాలెండరు ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి

**కొల్చారం,జనవరి16(సూర్యరేఖ)** కొల్చారం మండలం రంగంపేట సొసైటీ ఆవరణలో గురువారం నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్,మెదక్ జిల్లా గ్రంథాలయాల చైర్మన్ రెడ్డి సుహాసిని రెడ్డి,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రవీందర్ రెడ్డి,కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశం గౌడ్ " ఆదాబ్ హైదరాబాద్ " క్యాలెండర్ ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి మాట్లాడుతూ. డేరింగ్ డాషింగ్ దమ్మున్న దినపత్రిక ఆదాబ్ హైదరాబాద్ అని ఆయన కొనియాడారు. నిజాలు నిర్భయంగా,ప్రజా సమస్యల కోసం అనునిత్యం ప్రజల ప్రక్షాన ఉండి అధికారులకు దడ పుట్టించే పత్రిక ఆదాబ్ హైదరాబాద్ దినపత్రిక అని ఆయన అన్నారు.నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి,మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్,జిల్లా గ్రంథాలయాల చైర్మన్ సుహాసిని రెడ్డి,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమన్నగారి రవీందర్ రెడ్డి,కొల్చారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగులుగారి మల్లేశం గౌడ్,ఏల్లుగారి శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి,తాజా మాజీ సర్పంచ్ బండి సుజాత



రమేష్, కొమ్ముల రవీందర్ గౌడ్,తుక్కాపూర్ మాజీ సర్పంచ్ మాధవి శ్రీశైలం,మాజీ ఎంపిటిసి మాధవి రాజాగౌడ్, రంగంపేట గ్రామ అధ్యక్షుడు గొండ కృష్ణ,బండి మల్లేశం, కొమ్ముల సాయ గౌడ్,వరిగుంతం మాజీ ఎంపిటిసి రామకృష్ణ,సంగయ్య పేట మాజీ సర్పంచ్ బద్యా నాయక్, కొల్చారం ఆదాబ్ హైదరాబాద్ రిపోర్టర్ ఎర్ర పురుషోత్తం, కొల్చారం మండలం పాత్రికేయులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు యువకులకు ఉల్లాసానిస్తాయి..





## నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి

**కొల్చారం,జనవరి16(సూర్యరేఖ)** మద్దెల దశరథ జ్ఞాపకార్థ అనంతరం ఆయన కుమారులు ప్రవీణ్,నవీన్ రంగంపేటలో నిర్వహించిన ఆర్పిఎల్ సీజన్ 4 ఫైనల్ మ్యాచ్ లో హెూరాహెూరీ పోరులో యు.రాజు,బి.రాజు రెండు జట్లు విరోచిత పోరాటంలో బి.రాజు జట్టు విజయకేతన్ ఎగరవేసి ఫైనల్ కప్పుడు సొంతం చేసుకున్నది.యు.రాజు టీం వరల్డ్ కప్ సొంతం చేసుకుంది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి,మెదక్ జిల్లా గ్రంథాల సంస్థ చైర్పర్సన్ చిలుముల సువాసిని రెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్,హాజరై విజేతగా నిలిచిన జట్టు సభ్యులకు షీల్డ్ తో పాటు నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డిగారి సహకారంతో విన్నర్ ప్రైస్ మనీ రూ.20 వేలు,రన్నర్ ప్రైజ్ నగదు రూ.10వేలను నగదు రూపకంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో రెండు జట్లకుకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మదన్ రెడ్డి జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, సుహాసిని రెడ్డి లు మాట్లాడుతూ... యువకులు క్రీడల పట్ల మక్కువ పెంచుకొని చెడు వ్యసనాలకు దూరం కావాలని వారికి సూచన చేయడం జరిగింది.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి. రంగంపేటకి మినీ ప్లే గ్రౌండ్ను మంజూరు ఇప్పిస్తానని రాజిరెడ్డి సహకారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల సహకారంతో రెండేళ్లలో మినీ స్టేడియంలో నిర్మించుకుందామని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో విచార మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగాడ్, మల్లేశం గౌడ్,రంగంపేట గ్రామ తాజా మాజీ సర్పంచ్ బండి సుజాత, రమేష్, రంగంపేట గ్రామ శాఖ అధ్యక్షులు గుండా కృష్ణ,మాజీ విద్యా కమిటీ చైర్మన్ కుమ్ముల రవీందర్ గౌడ్,దుర్గేష్ గౌడ్,రమేష్,గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొడకంచి వెంకట్ గౌడ్,వంజరి రాజు, యాద గౌడ్,యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మల్లీ చందు, ఆనంద్, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పెద్దగారి గోవర్ధన్ మండల కాంగ్రెస్ పార్టీ ట్రెజరర్ చందాపురం మధుసూదన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏల్లుగారి శ్రీనివాస్ రెడ్డి, బండి మల్లేశం, అచ్చినపల్లి శ్రీరాములు, బద్యేనాయక్,అభిమానులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధికి ప్రభుత్వం సానుకూలం..





**నియోజకవర్గంలో ప్రజలకు అభివృద్ధిని చేరువ చేస్తా..**

**ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా పనిచేస్తాం.**

**నాయకులు,కార్యకర్తలు అందరిని కలుపుకొని పనిచేయాలి..**

**కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్**

**శంషాబాద్,జనవరి16** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రాంతాలను సమాన దృష్టితో అభివృద్ధి చేయడం జరుగుతుందని శాసనసభ్యులు టి.ప్రకాష్ గౌడ్ స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ప్రజలకు కనీస మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా పెట్టుకొని పని చేస్తున్నానని ఆయన వివరించారు.గురువారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రాళ్లగూడ ఇంద్రారెడ్డినగర్ కాలనీలో రూ.70 లక్షల టియుఎఫ్ఐడిసి నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల్లో ఆయన పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన కమ్యూనిటీ హాల్ నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు సూచించారు. ఎప్పటికప్పుడు పనుల్లో పర్యవేక్షణ ఉండాలని అన్నారు. ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన పనులను చేయించి అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మున్సిపాలిటీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు.కోట్ల రూపాయల అభివృద్ధిని ప్రజలకు చేరువ చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని వేగంగా అభివృద్ధి చేస్తున్నానని అన్నారు.ప్రభుత్వం నియోజకవర్గం అభివృద్ధికి సానుకూలంగా ఉందని ఆయన అన్నారు. స్థానికంగా నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని అన్నారు.ఎవరికీ ఎలాంటి సమస్యలు తలెత్తిన సత్వర పరిష్కారానికి నాయకులు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ సుష్మా మహేందర్ రెడ్డి,వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, సీనియర్ నాయకులు గణేష్ గుప్తా,దూడల వెంకటేష్, కౌన్సిలర్లు,కమిషనర్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష



**నిజాంపేట,జనవరి16(సూర్యరేఖ)** నస్కల్ రోడ్డు నిర్మాణ కొరకై ఆరవ రోజు రిలే నిరాహార దీక్షలో భాగంగా గురువారం గ్రామ మహిళలు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...నస్కల్,నందగోకుల్,రాంపూర్,నగరం,గ్రామాలకు గత రెండు సంవత్సరాల నుండి రోడ్డు బాగోలేక కంకర తేలి ఇబ్బందులు ఎదుర్కొంటున్న పట్టించుకునే నాధుడే లేరన్నారు. పిల్లల్ని స్కూలుకు పంపించాలంటే ఆటోలు బస్సులు రావడం లేదన్నారు.గ్రామంలో ఎవరికైనా ఆరోగ్యపరమైన సమస్యలు వస్తే రోడ్డు బాగోలేక నరకయాతన అనుభవిస్తున్నామన్నారు.ఇకనైనా ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే స్పందించి రోడ్డు పనులను ప్రారంభించాలన్నారు.ఇంతకుముందు కాంట్రాక్టర్ కు సహకరిస్తే పనులు ప్రారంభమవుతాయని త్వరతగతిన రోడ్డు పనులు ప్రారంభించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు హేమలత,లక్ష్మి,తీగలలింగమ్మ,నాగరాణి, కిష్టవ్వ,రేణుక, మంగలి నర్సింలు,స్వామి,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రెవెన్యూ అధికారుల ఫీల్డ్ పరిశీలన



**నిజాంపేట,జనవరి16(సూర్యరేఖ)**మండల పరిధిలోని చల్మెడ,వెంకటాపూర్ కె,నందిగామ, గ్రామాలలో గురువారం రైతు భరోసాకు సంబంధించి అధికారుల ఫీల్డ్ వెరిఫికేషన్ డేటా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని మండల వ్యవసాయ సోమలింగారెడ్డి అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వ్యవసాయ శాఖ రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో గ్రామాలలో సంయుక్తంగా తిరుగుతూ వ్యవసాయ యోగ్యం కానీ భూముల వివరాలను సేకరించామన్నారు.ఈ కార్యక్రమంలోఆర్ ఐ,లు ప్రీతి,ఇమాద్,వ్యవసాయ విస్తీర్ణ అధికారులుశ్రీలత,మౌనిక రమ్య,సీనియర్ అసిస్టెంట్ రమేష్,తదితరులు పాల్గొన్నారు.

## ఆవును దానం చేసిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి..



**శివంపేట,జనవరి16(సూర్యరేఖ)** ధనుర్మాసం పురస్కరించుకొని నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఆవును దానం చేశారు.మెదక్ జిల్లా శివంపేట మండలం గోమారం గ్రామంలోని ఎమ్మెల్యే నివాసంలో గురువారం గంగిరెద్దుల వారికి ఎమ్మెల్యే అవును దానం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు,స్థానిక నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బేగంపేట పి.హెచ్.సి లో ముగ్గురు వైద్య సిబ్బంది సస్పెన్షన్

**ఓ వైద్యాధికారికి షోకాజ్ నోటీసు..**



**రామగిరి/పెద్దపల్లి,జనవరి16(సూర్యరేఖ):** రామగిరి మండలం బేగంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే ముగ్గురు వైద్య సిబ్బందిని సస్పెండ్ చేస్తూ,ఓ వైద్య అధికారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.గురువారం ఉదయం 11.45 గంటలకు బేగంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్ సిబ్బంది విధులకు గైర్హాజరు కావడాన్ని గమనించారు.బయోమెట్రిక్ అటెండెన్స్ రిజిస్టర్లు పరిశీలించగా ఆ సిబ్బంది అనుమతి లేకుండా చాలా రోజులుగా విధులకు గైర్హాజరు అవుతున్నట్లు గమనించిన కలెక్టర్,పలుమార్లు ఆ సిబ్బందికి మెమోలు జారీ చేసినప్పటికీ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ సస్పెండ్ చేశారు.విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నర్సింగ్ స్టాఫ్ ఈ.ఉమా దేవి,హెల్త్ సూపర్వైజర్ కే.పుష్పవతి,ఎం.పీ.హెచ్.ఈ.ఓ ఏ. సీతా రామయ్యను సస్పెండ్ చేసినట్లు,వైద్య అధికారి డాక్టర్ జె.ప్రదీప్ కుమార్ కు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

# రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధికి ప్రభుత్వం సానుకూలం..





**నియోజకవర్గంలో ప్రజలకు అభివృద్ధిని చేరువ చేస్తా..**
**ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా పనిచేస్తాం.**
**నాయకులు,కార్యకర్తలు అందరిని కలుపుకొని పనిచేయాలి..**
**కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్**

**శంషాబాద్,జనవరి16** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రాంతాలను సమాన దృష్టితో అభివృద్ధి చేయడం జరుగుతుందని శాసనసభ్యులు టి.ప్రకాష్ గౌడ్ స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ప్రజలకు కనీస మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా పెట్టుకొని పని చేస్తున్నానని ఆయన వివరించారు.గురువారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రాళ్లగూడ ఇంద్రారెడ్డినగర్ కాలనీలో రూ.70 లక్షల టియుఎఫ్ఐడిసి నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల్లో ఆయన పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన కమ్యూనిటీ హాల్ నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు సూచించారు. ఎప్పటికప్పుడు పనుల్లో పర్యవేక్షణ ఉండాలని అన్నారు. ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన పనులను చేయించి అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మున్సిపాలిటీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు.కోట్ల రూపాయల అభివృద్ధిని ప్రజలకు చేరువ చేస్తున్నట్లు వివరించారు.ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని వేగంగా అభివృద్ధి చేస్తున్నానని అన్నారు.ప్రభుత్వం నియోజకవర్గం అభివృద్ధికి సానుకూలంగా ఉందని ఆయన అన్నారు. స్థానికంగా నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని అన్నారు.ఎవరికీ ఎలాంటి సమస్యలు తలెత్తిన సత్వర పరిష్కారానికి నాయకులు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ సుష్మా మహేందర్ రెడ్డి,వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్,సీనియర్ నాయకులు గణేష్ గుప్తా,దూడల వెంకటేష్, కౌన్సిలర్లు, కమిషనర్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈ నెల 18వ తేదీన అన్ని గ్రామ పంచాయతీలలో పథకాల అర్హుల జాబితాను ప్రదర్శించాలి

**అర్హుల ఎంపికకు సర్వే పనులు నేటి వరకు పూర్తి చేయాలి**
**ముత్తారం,కాల్వ శ్రీరాంపూర్ మండలాలలో విస్తృతంగా పర్యటనలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**ముత్తారం,జనవరి16(సూర్యరేఖ):** ప్రభుత్వం చేపట్టిన పథకాల కార్యక్రమాలకు సంబంధించి అర్హుల జాబితాను శనివారం నుంచి గ్రామపంచాయతీలలో,అన్ని మున్సిపాలిటీలలో ప్రదర్శించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్పష్టం చేశారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కాల్వ శ్రీరాంపూర్,ముత్తారం మండలాలలో విస్తృతంగా పర్యటించారు. కాల్వ శ్రీరాంపూర్ మండలం మంగపేట గ్రామంలో,ముత్తారం మండలంలో జరుగుతున్న రేషన్ కార్డు,రైతు భరోసా సర్వేలను కలెక్టర్ పరిశీలించారు. గ్రామాలలో జరుగుతున్న అర్హుల ఎంపిక ప్రక్రియ వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ. ప్రభుత్వం నూతనంగా చేపడుతున్న కార్యక్రమాల అర్హుల ఎంపిక ప్రక్రియ శ్రీరాంపూర్ మండలంలోని అన్ని గ్రామాలలో నేటి వరకు పూర్తి కావాలని కలెక్టర్ తెలిపారు.శనివారం ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతు భరోసా,రేషన్ కార్డు,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాల అర్హుల జాబితా వివరాలను ప్రదర్శించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామాలలో వ్యవసాయ యోగ్యం కాని భూములను మాత్రమే రైతు భరోసా జాబితా నుంచి తొలగించాలని,కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. రాళ్లు,రప్పలు ఉన్న భూములు,సాగు నీటి ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ చేసిన భూములు, పరిశ్రమల భూములు (రైస్ మిల్ పెట్రోల్ బంక్,ఆహార శుద్ధి పరిశ్రమ, నాలా కన్వర్షన్ జరిగిన భూములు,లేఔట్ ఉన్న భూములు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తు భూములు,రోడ్ల భూములు, భవనాలు నిర్మించుకున్న భూములు,మైనింగ్ జరుగుతున్న భూముల వివరాలు) రైతు భరోసా నుంచి తొలగించాలని అన్నారు. రేషన్ కార్డులకు సంబంధించి ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ స్థితిగతులను పరిశీలించి అర్హులకు రేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం శ్రీరాంపూర్ లోని యుపిహెచ్‌సీ ఆకస్మికంగా తనిఖీ చేసి డెలివరీలు పెంచాలని,ఎన్సీడి,అభా కార్డులు ఈ నెల 31 లోపు పూర్తి చేయాలని,వైద్యులు సమయపాలన పాటించాలని అన్నారు. అనంతరం రామగిరి మండలంలోని బేగంపేటలోని పి.హెచ్.సి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ప్రజలకు అందుతున్న వైద్య సేవలు గురించి ఆరా తీశారు.వైద్యులు సమయపాలన పాటించాలని అన్నారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మండల ఇంచార్జీ డిసిఓ శ్రీ మాల,శ్రీరాంపూర్ తహసీల్దార్ వకిల్, ముత్తారం తాహశీల్దార్ సుమన్,శ్రీరాంపూర్ ఎంపీడీవో చారి, వ్యవసాయ అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటకొస్తారు

**ఎన్ని కేసులు పెట్టినా న్యాయం,ధర్మం బీఆర్ఎస్ పక్షాన ఉంటుంది..**
**తప్పుడు కేసులతో బీఆర్ఎస్ పోరాటాన్ని ఆపలేరు.**
**ఒక్క హామీ నెరవేర్చకుండా 13 నెలలుగా రేవంత్ సర్కార్ కాలయాపన..**
**మాజీ కౌన్సిలర్,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎస్.వెంకటేష్ కురుమ**



**రాజేంద్రనగర్,జనవరి 16** ఫార్ములా–ఈ కార్ రేస్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కడిన ముత్యంలా బయటకు వస్తారని మాజీ కౌన్సిలర్,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎస్.వెంకటేష్ కురుమ అన్నారు.ఎన్ని చిల్లర కేసులు,బురదజల్లే కార్యక్రమాలు చేపట్టినా ఏమీ చేయలేరన్నారు.ఈడీ విచారణకు హాజరైన కేటీఆర్‌కు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన బీఆర్ఎస్ నాయకుల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించడంపై ఎస్.వెంకటేష్ కురుమ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎన్ని కేసులు పెట్టినా న్యాయం,ధర్మం బీఆర్ఎస్ పక్షాన ఉందని పేర్కొన్నారు.తప్పుడు కేసులతో బీఆర్ఎస్ పోరాటాన్ని ఆపలేరన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. హామీల అమలు ఎక్కడ అని ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.అక్రమ కేసులతో కేటీఆర్‌ను వేధిస్తున్నారని ధ్వజమెత్తారు.ఫార్ములా–ఈ రేసు నిర్వహణకు ప్రపంచ దేశాలు పోటీపడతాయని చెప్పారు. దేశంలోని ఎన్నో రాష్ట్రాలు రేసు నిర్వహణకు పోటీపడ్డాయి. కేటీఆర్ ఎంతో కష్టపడి హైదరాబాద్‌లో ఈ రేసును నిర్వహించారని తెలిపారు.హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచితే కేసులు పెడతారా అని ప్రశ్నించారు. అవినీతి అనేదే లేనప్పుడు ఈడీ కేసు ఎలా పెడుతుందన్నారు. ఒకసారి తెలంగాణ ప్రజలు ఆలోచించాలని కోరారు. శాంతియుతంగా నిరసనలు తెలుపుతుంటే అక్రమ అరెస్టులు ఏంటని ప్రశ్నించారు. పోలీసులు తమ తీరు మార్చుకోవాలని హితవు పలికారు. కేసీఆర్ కేటీఆర్, కవిత, హరీశ్‌రావులను అరెస్టు చేసి రాష్ట్రాన్ని దోచుకోవాలని రేవంత్ చూస్తున్నారని ఆరోపించారు. ఒక్క హామీ నెరవేర్చకుండా 13 నెలలుగా రేవంత్ సర్కార్ కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. అవినీతే లేని ఫార్ములా–ఈ కార్ రేసు కేసులో కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారని చెప్పారు. కాంగ్రెస్ చిల్లర చేష్టలతో బీఆర్ఎస్ నేతల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేదన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు.

## పేద ప్రజలకు అండగా రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**రూ.2.50 లక్షల ఎల్ఓసి మంజూరు**



**ముత్తారం,జనవరి 16(సూర్యరేఖ):** తెలంగాణ రాష్ట్ర ఐటి,పరిశ్రమలు,శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంథని నియోజకవర్గంలోని ముత్తారం మండలం కేశనపల్లి గ్రామానికి చెందిన పాశం రాజమ్మ కు రూ.2.50 లక్షల రూపాయల ఎల్వోసి మంజూరు చేసి ఇప్పించారు.కేశనపల్లి గ్రామానికి చెందిన పాశం రాజమ్మ గుండె వైద్య చికిత్సకు సంబంధించి నిమ్స్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ సహాయం కోసం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు తెలుపగా వెంటనే సీఎంఆర్ ఎఫ్ ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం బాధితులకు రూ.2.50 లక్షలు మంజూరు చేయించి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకులు శనివారం వారికి హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు.2 లక్షల 50 వేల రూపాయలు మంజూరు చేయించారు.తమకు అండగా నిలిచిన మంత్రి శ్రీధర్ బాబుకు వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## నిజాంపేటలో కౌలు డబ్బులు ఇవ్వాలని సెల్ టవర్ ఎక్కి వృద్ధుడి హల్ చల్..






**రామాయంపేట,జనవరి16(సూర్య రేఖ)**మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలో కౌలు డబ్బుల విషయంలో తనకు న్యాయం చేయాలని ఓ రైతు సెల్ టవర్ ఎక్కి హల్ చల్ చేశాడు.నిజాంపేట మండలం చల్మెడ గ్రామానికి చెందిన బొమ్మ చిన్ననారాయణ అనే వృద్ధుడు నిజాంపేటకు చెందిన శ్రీనివాస్ రెడ్డి పొలం కౌలుకు చేస్తున్నట్లు తెలిపాడు.కౌలు చేసిన డబ్బులు భూ యజమాని శ్రీనివాస్ రెడ్డీ ఇవ్వడం లేదని ఆరోపించారు.దీంతో మనస్తాపానికి గురైన నారాయణ ఆవేదనతో సెల్ టవర్ ఎక్కి తన అవేదన వ్యక్తం చేశాడు. విషయం తెలుసుకున్న ఏఎస్సై జైపాల్ రెడ్డి,సిబ్బందితో కలిసి వృద్ధుడిని సముదాయించి ఎట్టకేలకు కిందకి దింపారు.

## జీతభత్యాలు వెంటనే విడుదల చేయాలని మున్సిపల్ కార్మికుల ధర్నా



**రామయంపేట,జనవరి16(సూర్య రేఖ)** మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో మున్సిపాలీటీ కార్యాలయం వద్ద గురువారం మున్సిపల్ కార్మికులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా సిఐటియు ఉపాధ్యక్షురాలు బాలమణి మాట్లాడుతూ. గత ఆరు నెలలుగా మున్సిపల్ కార్మికులకు పిఎఫ్ కట్ కావడం లేదన్నారు.అదేవిధంగా పెండింగ్ ఉన్న కార్మికుల జీతాలు సరైన సమయంలో బ్యాంక్ ఖాతాలో జమ కావడం లేదన్నారు.ఆర్థిక సమస్యలతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. మున్సిపాలిటీలో ప్రతి నెల కార్మికుల జీతాలు 5 వ తేదీ లోపు బ్యాంకులో జమ చేయాలన్నారు.కార్మికులకు యూనిఫాంలు సబ్బులు, నూనెలు, షూస్,మాస్కులు, గ్లౌజులు కార్మికులకు ఇవ్వడం లేదన్నారు.ఉదయం నుండి సాయంత్రం వరకు కార్మికులు పనిచేస్తున్నా కనీసం వారిని గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.నేటి వరకు16 రోజులుగా కార్మికులు ధర్నా చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను తెలుసుకొని వెంటనే పెండింగ్ లో ఉన్న జీతభత్యాలు విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కార్మికులు పాల్గొన్నారు.

# నాలుగు ప్రతిష్ఠాత్మక పథకాల అమలుకు సర్వే షురూ

**అర్హులెవరూ కూడా ఎటువంటి ఆందోళన చెందొద్దు**
**విడతల వారీగా లబ్ధిదారులను గుర్తించడం జరుగుతుంది**
**రామయంపేట,కాట్రియాల సర్వే పరిశీలనలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



**రామయంపేట,జనవరి16(సూర్య రేఖ)** జిల్లా వ్యాప్తంగా రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,నూతన ఆహార భద్రతా కార్డులు,ఇందిరమ్మ ఇండ్లకు లబ్ధిదారుల ఎంపిక నాలుగు ప్రతిష్ఠాత్మక పథకాల అమలుకు సర్వే ప్రారంభం అయినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం మెదక్ జిల్లా రామాయంపేటలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. రామాయంపేట మండలం కాట్రియల గ్రామంలో,మున్సిపాలిటీ పరిధిలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన ఆహార భద్రతా కార్డులు,ఇందిరమ్మ ఇండ్లకు విచారణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సర్వే తీరును పరిశీలిస్తూ,ఇంట్లో సభ్యులతో మాట్లాడారు. ఇంట్లో ఎంత మంది ఉంటారు? ఏం జీవనం సాగిస్తారు? పొలం ఉందా?ఎన్ని ఎకరాలు ఉంది?వంటి తదితర వివరాలను సేకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రతి నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే దిశగా జిల్లా యంత్రాంగం పనిచేస్తుందన్నారు. లబ్ధిదారుల ముసాయిదా జాబితా తయారీకి నిరుపేదల గుర్తింపుకు సర్వే ప్రక్రియలో పారదర్శకంగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నాలుగు పథకాల అమలుకు జిల్లాలో సర్వే ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు.ఈ సర్వేలో భాగంగా పర్యవేక్షణకు అన్ని మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించగా, విచారణా బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వివరాలను సేకరిస్తున్నాయని ఆయన వివరించారు.సర్వే నిర్వహణ ద్వారా పథకాల అమలుకు లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు.సర్వే నిర్వహణకు ప్రజల సహకారం అందించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన నాలుగు పథకాల లబ్ధి ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు తీసుకోవడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన స్పష్టం చేశారు. సర్వే తీరును పరిశీలించిన కలెక్టర్ అభినందించారు.రైతు భరోసాకు సాగులో ఉన్న భూముల వివరాలు నమోదుకు వ్యవసాయ రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వేలో పాల్గొంటున్నారని తెలిపారు. వ్యవసాయానికి అనువుగా లేని భూములు అనగా నాలాలు, కన్వర్షన్ అయిన భూములు,రియల్ ఎస్టేట్ భూములు, మైనింగ్ చేస్తున్న భూములు, ప్రభుత్వం ప్రాజెక్టులు కొరకు తీసుకున్న భూములు తదితర వివరాలను ఎలాంటి పొరపాటుకు తావులేకుండా పకడ్బందీగా నమోదులు చేస్తున్నట్లు తెలిపారు.సర్వేలో ఏమైనా సమస్య వస్తుందా వస్తే కారణాలను వ్రాయాలని సూచించారు.16 నుండి 20 వ తేది వరకు సర్వే జరుగుతుందని,21 నుండి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించి అర్హుల జాబితాను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు.నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం సర్వే,గ్రామసభలు నిర్వహించాలని సూచించారు.మొదటి విడతలో నిరుపేదలకు ప్రాధాన్యం ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు.కాకపోతే విడతల వారీగా లబ్ధిదారులను గుర్తించడం జరుగుతుందన్నారు.అర్హులెవరూ కూడా ఎటువంటి ఆందోళన చెందవద్దన్నారు. అయోమయానికి గురికాకుండా తప్పులకు ఆస్కారం ఇవ్వకుండా పారదర్శకంగా అత్యంత జాగ్రత్తగా నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట రామాయంపేట ప్రత్యేక అధికారి ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్,రామాయంపేట తహాశీల్దార్ రజని,మండల అభివృద్ధి అధికారి,ఆయా మండలాల, గ్రామాల, ఎంపీఓలు, ఆర్ఐలు పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్లు,ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఊహించని రీతిలో ముగ్గుల పోటీలతో అందరికీ షాక్ ఇచ్చిన భవానీకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్










**పోటీ గురించి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ముంగిళ్ల ముందు వేసిన ముగ్గులకు బహుమతులు..**
**హర్షం వ్యక్తం చేసిన కాలనీ సభ్యులు..**

**రాజేంద్రనగర్,జనవరి16** సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఎవరి ఇంటిని వారు పలు రకాల రంగవల్లులతో ముగ్గులు వేస్తూ ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతుంటారు.అయితే ప్రతి సంవత్సరం సంక్రాంతి ఉత్సవాలు అంటే అందరికీ ముగ్గుల పోటీలు ఉంటాయిలే అనే ధ్యాసలోనే ఉంటారు.ప్రధానంగా మహిళలు ఎక్కడ పోటీలు జరిగినా ఆకర్షణీయమైన ముగ్గులు వేసేందుకు పోటీలు పడి రకరకాల రంగులను ఉపయోగిస్తూ రకరకాల డిజైన్లను వేస్తుంటారు.దీంతో అనేక రకాల బహుమతులను సైతం పొందుతుంటారు.అయితే రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని భవానికాలనీలో ఊహించని రీతిలో రంగవల్లుల పోటీలను ఆ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించి అందరినీ ఔరా అనిపించారు. కాలనీలో ఇటీవల నిర్వహించిన సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా ఎవరి ఇంటి ముందు వారు సాధారణంగానే ముగ్గులు వేశారు.అయితే వేసిన ముగ్గుల జాబితాను అన్నింటిని వెల్ఫేర్ అసోసియేషన్ తెప్పించుకొని ప్రత్యేకంగా పరిశీలించింది.మొత్తం 34 మంది సభ్యులు కలిగిన ఈ వెల్ఫేర్ అసోసియేషన్ లో ప్రథమ,ద్వితీయ,తృతీయ బహుమతులను ఊహించని విధంగా పలువురు మహిళలు సాధించారు.బహుమతులు సాధించిన మహిళలకు గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని బహుమతులను ప్రదానం చేయనున్నట్లు వెల్ఫేర్ అసోసియేషన్ ప్రకటించింది. గెలిచిన వారిలో ప్రథమ బహుమతి బీ.కామాక్షి,రెండవ బహుమతి ఏ.శోభారాణి,తృతీయ బహుమతి ఎం.స్వాతి కిషోర్ (ఆడిటర్) లు సాధించినట్లు అసోసియేషన్ ప్రకటించింది.విజేతలు గణతంత్ర దినోత్సవం నాడు బహుమతులను అందుకోవాలని అసోసియేషన్ వెల్లడించింది. ఇలా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పోటీలు నిర్వహించడం వల్ల నేచురల్ గా ముగ్గులు వేయడం జరుగుతుందని,తద్వారా విజేతలను గుర్తించడం సంతోషంగా ఉందని పలువురు అసోసియేషన్ సభ్యులు పేర్కొంటున్నారు. దీంతో విజేతల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి

# నార్సింగి జంట హత్యల కేసును ఛేదించిన పోలీసులు.. వెలుగులోకి సంచలన నిజాలు

**మధ్యప్రదేశ్‌లో ముగ్గురు నిందితుల అరెస్టు..**



**గండిపేట్,జనవరి 16** నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని పుప్పాలగూడ జంట హత్యల కేసును పోలీసులు ఛేదించారు. ఈ జంట హత్యల కేసులో రాహుల్, రాజ్‌కుమార్, సుఖేంద్ర అనే ముగ్గురు నిందితులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఇద్దరిని చంపి నిందితులు మధ్య ప్రదేశ్ పారిపోయారు.బిందు గత కొంత కాలంగా వ్యభిచారం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అంకిత్ స్నేహితుడు రాహుల్ బిందును అసభ్యకరంగా తీసిన వీడియోతో వీరి మధ్య వివాదం తలెత్తినట్లు తెలుస్తోంది. అంకిత్, బిందుపై కోపంతో వారిని చంపాలని రాహుల్ నిర్ణయించు కున్నట్లు దర్యాప్తులో తెలిసిందని పోలీసులు వెల్లడించారు. దీంతో రాజ్‌కుమార్,సుఖేంద్ర సాయంతో అంకిత్,బిందును రాహుల్ హతమార్చినట్లు వెల్లడించారు.వీరిద్దరిని చంపిన అనంతరం నిందితులు మధ్యప్రదేశ్‌కు పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు.ఫోన్ సిగ్నల్ ఆధారంగా మధ్య ప్రదేశ్‌లో ముగ్గురిని పట్టుకున్నారు. నిందితులను స్థానిక కోర్టులో హాజరుపరిచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు. హత్యకు గురైన బిందు ఈ నెల 3న అదృశ్యమైనట్లు వనస్థలిపురంలో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. కాగా ఆమెకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతి చెందిన అంకిత్,బిందుపై ఈ నెల 8న గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. నార్సింగి పరిధిలోని పుప్పాలగూడలో వీరు మంగళవారం దారుణంగా హత్యకు గురైన విషయం తెలిసిందే..కాగా వీరిని సంక్రాంతి పండుగ రోజే నిందితులు పక్కా ప్రణాళికతో దాడి చేసి హతమార్చడంతో ఈ ఘటన సంచలనం సృష్టించింది. పోలీసులు మృతదేహాలను పరిశీలించి ఇద్దరూ దారుణహత్యకు గురైనట్టు గుర్తించారు. కత్తులతో పొడిచి అనంతరం బండరాళ్లతో తలపై బాది హత్య చేసినట్టు ఆనవాళ్లున్నాయి. ఘటనా స్థలికి దూరంగా భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి.పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఘటనాస్థలిలో కొన్ని ఆధారాలు సేకరించామని,వాటి ద్వారా మృతుల వివరాలు గుర్తించి, అలాగే నిందితులను పట్టుకుంటామని గతంలోనే పోలీసులు వెల్లడించారు.

## నస్కల్ రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలని రిలే దీక్షలు చేసిన మహిళలు





**రామయంపేట,జనవరి16(సూర్య రేఖ)** మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రం నుండి నస్కల్ నందగోకుల్ రాంపూర్ వెళ్లే అంతర్గత రహదారి దెబ్బతిని అధ్వాన్నంగా తయారైందని,రోడ్డుపై ప్రయాణం చేయాలంటే భయమేస్తుందని డ్వాక్రా మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ మేరకు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆరవ రోజుకు చేరుకున్నాయి.రోడ్డును తవ్వి కంకర పోసి రెండు సంవత్సరాలు కావస్తున్నా సదరు కాంట్రాక్టర్ ఇప్పటికీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయలేదని వారు ఆరోపించారు. పిల్లలకు స్కూల్ కు వెళ్లాలన్నా వృద్ధులు,మహిళలు,రోగులు హాస్పిటల్ కు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు వాపోయారు.ఇకనైనా ఎమ్మెల్యే చొరవ తీసుకొని సదరు కాంట్రాక్టర్ చే రోడ్డు నిర్మాణం పనులు వెంటనే ప్రారంభించేలా చొరవ చూపాలని కోరారు.ఈ దీక్ష కార్యక్రమంలో మహిళా సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

**- మెదక్ ఆర్డీవో రమాదేవి**



**కొల్చారం,జనవరి16(సూర్య రేఖ)**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,కొత్త ఆహార భద్రత కార్డులు,ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలకు అనుగుణంగా లబ్ధిదారుల ఎంపికకు కసరత్తును ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో జరుగుతోన్న సర్వే సరళిని పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఆర్డీవో రమాదేవి మాట్లాడుతూ..దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరుపేదలను గుర్తించాలని,భూములు, ఆదాయం వంటి వివరాలను తప్పులు లేకుండా ఫార్మ్ లో నమోదు చేయాలని ఆదేశించారు.ఈ సర్వేలో భాగంగా విచారణలో తేలిన వివరాల ఆధారంగా అర్హుల జాబితాను రూపొందించనున్నట్లు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మెదక్ తహాశీల్దార్ లక్ష్మణ్ బాబు,ఆర్ఐ లక్ష్మణ్,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బోర్ల చెరువుల కింది.. జోరుగా యాసంగి సాగు..



**మెదక్,జనవరి 16(సూర్యరేఖ)** మెతుకుసీమలో యాసంగి పంటల సాగు జోరుగా కొనసాగుతోంది.జిల్లాలో ఎక్కువగా బోర్ల కిందనే పండిస్తున్నారు.ఈ సీజన్‌లో బోర్లతో పాటు తైబందీ జరిగిన చెరువుల ప్రాంతాల్లో పంటలను పండిస్తున్నారు.మరోవైపు ప్రాజెక్టుల ద్వారా నీటిని విడుదల చేయనున్నడంతో వాటి పరిధిలో సాగు చేస్తున్నారు. ఎక్కువుగా వరికే అన్నదాతలు మొగ్గుచూపుతున్నారు.జిల్లాలో యాసంగిలో అన్ని రకాల పంటలు కలిపి 2,84,836 ఎకరాల్లో సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.వరి, శనగ, జొన్న,మొక్కజొన్న తదితర పంటలను ఎక్కువగా వేస్తుంటారు.ఈ సీజన్‌లో పంటల సాగు ముగింపు దశకు చేరుకునే లోపు ఎక్కువ నీటి వాడకం అవసరం కావడంతో అన్నదాతలు ముందుగా బోర్ల కిందనే పంటలు వేశారు. ఏకైక మధ్యతరహా ప్రాజెక్టు ఘనపూర్ కింద సుమారు 25 వేల ఎకరాల్లో సాగు అవుతుందని అంచనా వేశారు.పలు విడతల్లో నీళ్లను ఆనకట్ట నుంచి దిగువకు విడుదల చేయాలని నీటి పారుదల శాఖ అధికారులు నిర్ణయించారు.ఆనకట్ట పరిధిలోని రైతులు ఇప్పుడిప్పుడే సాగు పనులు మొదలు పెట్టారు.

**80,103 ఎకరాల్లో..**

ప్రస్తుత యాసంగిలో అన్ని రకాల పంటల సాగు లక్ష్యం 2.84 లక్షలు కాగా,ఇప్పటి వరకు 80,103 ఎకరాల్లోనే సాగయ్యాయి.ఇందులో వరి అత్యధికంగా 75,000 ఎకరాల్లో,జొన్న 3,047 ఎకరాలు, మొక్కజొన్న 1,669 ఎకరాల్లో సాగు చేశారు.వరి నాట్లు కొనసాగుతున్నందున పంటల విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.చలి అధికంగా ఉండడంతో ప్రభావం చూపుతోంది.2023-24 యాసంగిలో 2,73,801 ఎకరాల్లో అన్ని రకాల పంటలను వేశారు.

## శంషాబాద్‌లో రంగారెడ్డ రవాణా శాఖ అధికారుల దాడులు..

**16 బస్సులపై కేసులు నమోదు**





**శంషాబాద్,జనవరి 16** ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు.వరుస దాడులతో ట్రావెల్స్ బస్సుల యజమానులకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. మోటార్ వాహన చట్టాన్ని ఉల్లంఘిస్తున్న బస్సులపై కేసులు నమోదు చేస్తున్నారు.ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్ వస్తున్న బస్సులపై దృష్టి సారించారు.కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి, కన్యాకుమారి, కర్ణాటక, బెంగుళూరు, ఆంధ్ర ప్రదేశ్,గోవాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు తనిఖీలు చేస్తున్నారు. తెలంగాణ ట్యాక్స్ కట్టని బస్సులపై కొరడా ఝులిపిస్తున్నారు.లగేజీ తరలించే వాహనాలపై సీరియస్‌గా వ్యవహరిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన 16 బస్సులపై కేసులు నమోదు చేశారు.

సూర్య



# తెలంగాణ నుంచి రాహుల్ గాంధీ పాదయాత్ర



**హైదరాబాద్ :** తెలంగాణలో ఓవైపు పాలన మరో వైపు పార్టీ బలోపేతం దృష్టిపెట్టిన కాంగ్రెస్ పార్టీ ఆ దిశగా వేగం పెంచింది. నెలాఖరుకు పెండింగ్ నామినేటెడ్ పోస్టుల భర్తీతో పాటు, పీసీసీ నూతన కార్యవర్గం ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. ఫిబ్రవరిలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం ద్వారా పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపేందుకు ప్లాన్ చేసింది.మరో పాదయాత్రకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేపట్టనున్నారు. “సేవ్ కాన్‌స్టిట్యూషన్ పాదయాత్ర” (సంవిధాన్ బచావో రాష్ట్రీయ పాదయాత్ర) తెలంగాణ నుంచి ఈ యాత్ర ప్రారంభించేలా చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఢిల్లీలో ఏఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్‌ను కలిశారు. గణతంత్ర దినోత్సవం నాడు ప్రారంభం కానున్న ఈ పాదయాత్రకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేశవ్యాప్త ప్రచారంలో భాగంగా వచ్చే నెల మొదటి పక్షం రోజుల పాటు ర్యాలీని ప్లాన్ చేశారు.రాజ్యాంగ విలువలను కాపాడవలసిన అవసరాన్ని లక్ష్యంగా పెట్టుకుని ంఎఅఅ నేతృత్వంలో ఈ పాదయాత్ర సాగనుంది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను కేంద్ర హోంమంత్రి అమిత్ షా అగౌరవపరిచారంటూ ఈ యాత్ర ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. జనవరి 8న గాంధీభవన్‌లో జరిగిన పిఎసి సమావేశంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగాన్ని పరిరక్షించడంపై దృష్టి సారించిన పిఎసి ఏడాది పొడవునా నిరసన కార్యక్రమాన్ని కొనసాగించాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ర్యాలీలో నిర్వహించ తలపెట్టిన ర్యాలీలో ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొనాలని కోరింది.తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా కీలక సమావేశం జరిగింది. సీఎం రేవంత్ సహా రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలతో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నివాసంలో కీలక భేటీ జరిగింది. రేవంత్ రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సుమారు గంటన్నరపాటు రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేసీ వేణుగోపాల్‌తో చర్చించారు. తెలంగాణ ర్యాలీకి సంబంధించిన వివరాలను ఖరారు చేయాలని కోరింది. అనంతరం మీడియాతో మాట్లాడిన మహేష్ కుమార్ గౌడ్ ఖమ్మం లేదా సూర్యాపేటలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని, అక్కడ రాహుల్ గాంధీ కీలక ప్రసంగం చేయాలని కోరినట్లు తెలిపారు. నెలాఖరులోగా ప్రభుత్వ సంస్థలతోపాటు ప్రభుత్వ సంస్థల్లో నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తామని మహేష్ గౌడ్ తెలిపారు. అయితే, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మంత్రివర్గ విస్తరణపై వ్యాఖ్యానించడానికి నిరాకరించిన ఆయన, తుది నిర్ణయం పార్టీ హైకమాండ్, ముఖ్యమంత్రిదేనని పేర్కొన్నారు. టీపీసీసీ నూతన కార్యవర్గం ఏర్పాటుపైనా సమావేశంలో చర్చించారు. ప్రజల్లో చురుగ్గా పని చేసే నాయకులకే డీసీసీ అధ్యక్ష పదవులు వచ్చేలా చూస్తామన్నారు.

# కేటీఆర్ ఈడీ విచారణ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత



**హైదరాబాద్ :** ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఈడీ గురువారం విచారిస్తోంది. గచ్చిబౌలిలోని నివాసం నుంచి బయలుదేరిన కేటీఆర్ నేరుగా ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం ముందు పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. దాదాపు 200 మంది సిబ్బంది మోహరించగా.. బాష్పవాయువు, వాటర్ కెనాన్లను అందుబాటులో ఉంటారు. కేటీఆర్ విచారణకు హాజరయ్యే సమయంలోనే భారీ సంఖ్యలో ఆ పార్టీ కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. దీంతో వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వాగ్వాదం జరిగి తోపులాట చోటు చేసుకోగా.. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మరోవైపు, కేటీఆర్ విచారణ నేపథ్యంలో నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యాలయానికి వెళ్లే రహదారిపై ఇరువైపులా పోలీసులు భారీగా మోహరించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం గాంధీభవన్ వద్ద కూడా భారీగా బందోబస్తు చేపట్టారు.కాగా, దర్యాప్తులో భాగంగా ఇప్పటికే ఇదే కేసులో నిందితులుగా ఉన్న అప్పటి పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలను ఈడీ విచారించింది. గురువారం కేటీఆర్‌ను ఈడీ విచారిస్తోంది. హెచ్ఎండీఏ ఖాతా నుంచి విదేశీ సంస్థకు నిధుల బదిలీపైనా ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. సంస్థకు రూ.45.7 కోట్ల బదిలీ వ్యవహారంపై కేటీఆర్‌ను ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఏసీబీ నుంచి వివరాలు తెప్పించుకున్న ఈడీ మరింత లోతుగా విచారిస్తున్నట్లు సమాచారం.ఒప్పందాల్లో కీలకంగా వ్యవహరించిన వ్యక్తులు ఎవరు. ఫెమా నిబంధనలను ఉల్లఘించి విదేశీ కంపెనీకి నిధులు ఎంత పంపారు. ఎలా పంపారు. అవి చివరికి ఎవరి ఖాతాలో పడ్డాయి. ఇందులో కేటీఆర్‌తోపాటు అధికారు పాత్ర ఎంత. ఏ ఉద్దేశంతో ఈ వ్యవహారం నడచింది. అన్న వివరాలను ఈడీ తెలుసుకునే అవకాశం ఉంది. ఆ తర్వాతే ఈడీ కేటీఆర్‌పైకేసు పట్టే అవకాశాలను పరిశీలంచనుందని న్యాయ నిపుణులు చెబుతున్నారు.ఈ కేసులో ఇప్పటికే అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈడీ అధికారులు విచారిస్తున్నారు. మరోవైపు, ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించగా.. ఈ నిర్ణయాన్ని ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అయితే, ఈ పిటిషన్‌ను సైతం సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ‘డిస్మిస్డ్ యూజ్ విత్‌డ్రాన్’గా ప్రకటిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అటు, రాజకీయ వేధింపుల్లో భాగంగానే ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని కేటీఆర్ ట్విట్టర్ వేదికగా విమర్శించారు. కాంగ్రెస్ పెడుతున్న కేసులు తమ ఘనతను తుడిచేయలేవని అన్నారు.

**'రాజకీయ వేధింపులే'**

ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారానికి సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ గురువారం ఉదయం ఈడీ విచారణకు హాజరయ్యారు. గచ్చిబౌలిలోని ఆయన నివాసం నుంచి బయలుదేరి నేరుగా ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలోనే బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం ముందు భారీ బందోబస్తు చేపట్టారు. దాదాపు 200 మంది పోలీసులు అక్కడ మోహరించారు. అటు, ఈడీ కార్యాలయం వద్ద అధిక సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు చేరుకోగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం జరిగి తోపులాట చోటు చేసుకుంది. దీంతో అక్కడి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఫార్ములా ఈ రేస్‌లో వ్యవహారానికి సంబంధించి ఏసీబీ దర్యాప్తు చేస్తుండగా.. ఇందులో ఆర్బీఐ అనుమతి లేకుండా విదేశీ సంస్థకు నిదుల చెల్లింపుపై ఈడీ మరో కేసు నమోదు చేసింది. ఇదే కేసులో ఇప్పటికే అప్పటి పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలను ఈడీ విచారించింది. ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించగా.. ఈ నిర్ణయాన్ని ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అయితే, ఈ పిటిషన్‌ను సైతం సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ‘డిస్మిస్డ్ యూజ్ విత్‌డ్రాన్’గా ప్రకటిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.హెచ్ఎండీఏ ఖాతా నుంచి విదేశీ సంస్థకు నిధుల బదిలీపై ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు. విదేశీ సంస్థకు రూ.45.7 కోట్ల బదిలీ వ్యవహారంపై కేటీఆర్‌ను ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటికే అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈడీ అధికారులు విచారిస్తున్నారు.

కాగా, ఈడీ విచారణకు హాజరయ్యే ముందు ట్విట్టర్ వేదికగా కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెడుతున్న కేసులు ఘనతను తుడిచేయలేవని అన్నారు. ‘హైదరాబాద్‌లో ఫార్ములా ఈ రేస్ నిర్వహణ అనేది మంత్రిగా తాను తీసుకున్న నిర్ణయాల్లో ఒకటి. ఆనాడు రేసర్లు అంతా హైదరాబాద్ నగరాన్ని కీర్తించారు. హైదరాబాద్ నగర బ్రాండ్ నాకు ముఖ్యం. పారదర్శకంగా రూ.46 కోట్లు బ్యాంక్ టు బ్యాంక్ విధానంలో చెల్లించిన తర్వాత అవినీతి ఎక్కడిది..? మనీ లాండరింగ్ ఎక్కడిది..?. ఒక్క రూపాయి కూడా వృథా కాలేదు. ప్రతి పైసాకి లెక్క ఉంది. ఫార్ములా ఈ రేస్ రద్దు వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం జరిగింది. ఎలాంటి అవినీతి జరగకున్నా కేసులు, కోర్టులంటూ రాజకీయ వేధింపులకు గురి చేస్తున్నారు. కచ్చితంగా ఈ అంశంలో నిజమే గెలుస్తుంది. తప్పు లేకపోయినా ఏదో కాలం వెల్లదీసేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. త్వరలోనే తప్పకుండా నిజం తెలుస్తుంది.’ అని కేటీఆర్ పేర్కొన్నారు.


# బనకచర్ల ప్రాజెక్టుపై రేవంత్ పోరుబాట

**హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. దీన్ని వ్యతిరేకిస్తూ ఏపీతోపాటు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాయాలని నిర్ణయించింది. విభజన చట్టం ప్రకారం ఏదైనా నదిపై ప్రాజెక్టు నిర్మించాలంటే పొరుగు రాష్ట్రానికి సమాచారం ఇవ్వాలని అది ఇవ్వకుండానే ప్రాజెక్టు ప్రకటన చేశారని ఆగ్రహంతో ఉంది తెలంగాణ. బనకచర్ల ప్రాజెక్టు తెలంగాణ, ఏపీ ప్రభుత్వాల మధ్య తాజా వివాదానికి కారణమయ్యేలా ఉంది. దీనిపై పోరాటం చేయాలని రేవంత్ రెడ్డి సర్కారు నిర్ణయించింది. నదుల అనసంధానం చేస్తామని ఇప్పటికే ప్రటించిన చంద్రబాబు ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును ప్రకటించారు. తమను సంప్రదించకుండా ఇలా ప్రాజెక్టు ప్రకటించడంపై అప్పట్లోనే అభ్యంతరం వ్యక్తం చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం దీనిపై కేంద్ర స్థాయిలో పోరాటానికి సిద్ధమైంది. ఏపీ చేపట్టే నదుల అనుసంధాన ప్రాజెక్ట్ బనకచర్లపై అభ్యంతరం చెబుతూ కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి, గోదావరి, కృష్ణా నది యాజమాన్య బోర్డుకు ఘాటైన లేఖ రాయాలని అధికారులకు రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రాజెక్టును తెలంగాణ ఎందుకు అభ్యంతరం చెబుతోంది… అనే వివరాలు తెలియజేస్తూ లేఖలు రాయాలని స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల్లో ఏ రాష్ట్రమైనా, ఏ నదిపైనైనా ప్రాజెక్టు చేపడితే జీఆర్ఎంబీ, కేఆర్ఎంబీసహా పొరుగు రాష్ట్రానికి సమాచారం ఇవ్వాలని ఏపీ పునర్విభజన చట్టం స్పష్టం చేస్తోందని అంటోంది తెలంగాణ. ఇదే విషయాన్ని లేఖలో రాయాలని నిర్ణయించారు. నీటి పారుదల శాఖపై సమీక్ష నిర్వహించిన రేవంత్ రెడ్డి బనకచర్లపై అభ్యంతరం తెలియజేస్తూ లేఖ రాయాలని అధికారులు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహా నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. కృష్ణా నదీ జలాల విషయంలో కూడా రాజీ పడే ప్రసక్తి వద్దని సూచించారు. ట్రిబ్యునల్స్‌లో గట్టి వాదనలు వినిపించాలని స్పష్టంచేశారు. ఐఎస్ఆర్‌డబ్ల్యూడీఏ-1956 సెక్షన్ 3 ప్రకారం జలాలు కేటాయించేలా వాదించాలన్నారు. పోలవరం ప్రాజెక్టు వల్ల ముప్పు అంశంపై కూడా హైదరాబాద్ ఐఐటీతో చేయిస్తున్న స్టడీ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని రేవంత్ స్పష్టం చేశారు. తెలంగాణలో మిగిలిన పెండింగ్ ప్రాజెక్టులు, వాటి అనుమతుల విషయంలో ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు సీఎం రేవంత్ రెడ్డి.

## ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే కాంగ్రెస్ ప్రభుత్వం..

**కాంగ్రెస్ ప్రభుత్వం పై అసత్య ఆరోపణలు చేస్తున్న బి ఆర్ఎస్ పార్టీ నాయకులు..**

**మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్**



**కొల్చారం,జనవరి16(సూర్యరేఖ)** కొల్చారం మండలం రంగంపేట్ లో గురువారం మీడియా సమావేశం నిర్వహించిన అనంతరం మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్,నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేస్తునం,ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు, రూ.500 గ్యాస్ సిలిండర్,ఫ్రీ కరెంట్,ఆరోగ్యశ్రీ సాయం రూ.10లక్షలకు పెంపు,రైతులకు రుణమాఫీ సైతం చేసింది.జనవరి 26 నుంచి రైతు భరోసా పంట పెట్టుబడి సాయం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేయనుంది.ఈ నెల 26న సాగుకు అనుకూల భూములకు మాత్రమే పెట్టుబడి సహాయం ఎకరానికి రూ.12 వేలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గణతంత్ర దినోత్సవం ఈ నెల 26 నుంచి పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఆహార భద్రత రేషన్ కార్డులు జారీ కానున్నాయి.కొత్త రేషన్ కార్డుల మంజూరుతోపాటు. పాత రేషన్ కార్డులలో మార్పులు, చేర్పులు కూడా చేయనున్నారు.ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద రైతు కూలీలకు ఏడాది 12 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని సైతం తెలంగాణ ప్రభుత్వం చేయనుంది.ఇది కూడా జనవరి 26 నుంచి అమలు చేయనుంది.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ఇప్పటికే క్షేత్రస్థాయిలో సర్వే పూర్తయింది.ఇళ్ల లబ్దిదారులకు పలు విడతల్లో రూ.5 లక్షలను ఇవ్వనుంది.ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి. ఒక్కొక్కటిగా 6 గ్యారంటీలను అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది.ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర నాయకులు రవీందర్ రెడ్డి,జిల్లా నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కొల్చారం మండల అధ్యక్షులు మల్లేశం గౌడ్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చందు,క్రిష్ణ, నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొనారు.

## నేడు కిస్మత్ పూర్,శంషాబాద్,షాపూర్ లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం..



**శంషాబాద్/బండ్లగూడ,జనవరి16** బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో గల రాక్ చర్చ్ విద్యుత్ ఫీడ్ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు శ్రీ సాయికాలనీ, ప్రభుత్వ పాఠశాల,రాఘవేంద్రకాలనీ, ఫైన్ ఆర్ట్స్ కాలనీ,ఎన్ఆర్ఐ టౌన్షిప్,రాధారియాలిటీ, వివేకనంద కాలనీ,యాదాద్రి కాలనీ,ఓంనగర్ కాలనీ, ఎస్ ఎం ఎంక్లేవ్ 1,2,సిఎల్ విల్లాస్,పూజా విల్లాస్, రాక్ చర్చ్,కృతి విల్లాస్,డాన్ బోస్కో విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10:30 నుండి 11:30 గంటల వరకు స్నేహిత హిల్స్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలైన మీచల్ కాలనీ,వినాయకనగర్,డిడి కాలనీ,కాళీమందిర్, ఎన్ఎఫ్సీకాలనీ, ఆదర్శనగర్, ఎక్సైజ్ అకాడమీ,అభ్యుదయనగర్,అరుణోదయ నగర్,సంధ్యానగర్,జిఆర్ నగర్,మాచన్పల్లి ఎంక్లేవ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కిస్మత్పూర్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజు తెలిపారు.

**శంషాబాద్ లో..**

శంషాబాద్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని మధురానగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు,వివేకానంద విద్యుత్ పీటర్ పరిధిలో మధ్యాహ్నం మూడు గంటల నుండి ఐదు గంటల వరకు మధురానగర్, శ్రీనివాస ఎంక్లేవ్,రిజిస్ట్రేషన్ ఆఫీస్,మధ్యాహ్నం వివేకానందనగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాల అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ షేక్ భాషా తెలిపారు.విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

## నేడు మల్కారంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం..

**శంషాబాద్,జనవరి 16** షాపూర్ విద్యుత్తు సెక్షన్ పరిధిలోని మల్కారం విద్యుత్ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 10.00 గంటల నుండి 13.00 వరకు,నానాజీ పూర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 14.00 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహణ కోసం మల్కారం,నానాజీ పూర్,రాయన్నగూడ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ రెడ్డి తెలిపారు.విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

## ఆ నాలుగు మండలాలకు మహర్దశ

**హైదరాబాద్ :** హైదరాబాద్ విశ్వనగరంగా అభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు నగరంలో పెట్టుబడులు పెట్టాయి. మరికొన్ని సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కడుతున్నాయి. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ సిటీలు గణనీయమైన అభివృద్ధిని సాధించాయి. నగర విస్తరణలో భాగంగా రేవంత్ సర్కార్ ఫోర్త్ సిటీ పేరుతో ఫ్యూచర్ సిటీని ప్లాన్ చేస్తోంది. అందుకు సంబంధించిన కార్యచరణ ప్రారంభించింది. రాష్ట్రంలో కొత్తగా ఐటీ సంస్థలు, పరిశ్రమలను స్థాపించేందుకు సర్కార్ శరవేగంగా ప్రణాళికలను రెడీ చేస్తోంది. ఫోర్త్ సిటీ చుట్టూ వీటిని ఏర్పాటు చేసేందుకు వీలుగా ప్రభుత్వ, పట్టా భూముల వివరాలను సేకరించేందుకు ఇప్పటికే రెవెన్యూ అధికారుల కసరత్తు చేస్తున్నారు.రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ఆరు మండలాల్లో ఈ పరిశ్రమలు స్థాపించనున్నారు. ఔటర్‌కు సమీపంలోని కొన్ని, ఎయిర్‌పోర్టుకు దగ్గరగా మరికొన్ని ప్రాంతాలను ఇప్పటికే అధికారులు పరిశీలించారు. ఆరు మండలాల్లో కొన్ని గ్రామాలను సూత్రప్రాయంగా ఎంపిక చేశారు. గత ప్రభుత్వం పరిశ్రమలకు స్థలాలిచ్చి ఇప్పటికీ కార్యకలాపాలు కొనసాగించకపోతే వాటిని వెనక్కితీసుకునేందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించాలని రెవెన్యూ అధికారులు నిర్ణయించారు. ఫోర్త్ సిటీకి పదిహేను కిలోమీటర్ల విస్తీర్ణంలో కొత్తగా పరిశ్రమలు, టెక్స్‌టైల్ హబ్‌లను ప్రారంభించాల ని అధికారులు భావిస్తున్నారు.ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమీ పంలో ఫాక్స్‌కాన్ సంస్థ ఆపిల్ ఫోన్ విడిభాగాల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. అలాగే షాబాద్ మండలంలో ఎలక్ట్రిక్ ఈవీ బస్సుల తయారీ, టెక్స్‌టైల్స్ పరిశ్రమలు ఇప్పటికే తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. కొత్తగా ఆయా ప్రాంతాల్లో ఐటీ, పరిశ్రమల హబ్‌లతో పాటు ఎడ్యుకేషన్ ఇనిస్ట్యూషన్స్, గేమింగ్ జోన్స్, రెస్టారెంట్లను ప్రారంభిస్తే రానున్న నాలుగైదేళ్లలో అక్కడ కూడా అభివృద్ధి వేగవంతమవుతుందని అధికారులు భావిస్తున్నారు.




# అజిత్ 'విడాముయర్చి' తెలుగు టైటిల్ ఇదే.!

తమిళ అగ్ర నటుడు అజిత్ ప్రస్తుతం కార్ రేసింగ్ పోటీల్లో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. రీసెంట్‌గా దుబాయ్‌లో జరిగిన కార్ రేసింగ్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచి సత్తాచాటింది అజిత్ రేసింగ్ జట్టు. దీంతో నటుడిగానే కాకుండా రేసర్‌గా రాణించిన అజిత్‌పై ప్రశంసలు కురిపించారు ప్రముఖులు. ఇదిలావుంటే ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'విడాముయర్చి' ఏకే 62గా వస్తున్న ఈ సినిమాకు మగిజ్ తిరుమేని దర్శకత్వం వహిస్తుండగా.. త్రిష కథానాయికగా నటిస్తుంది. అయితే ఈ సినిమాను తెలుగులో పట్టుదల పేరుతో విడుదల చేస్తున్నారు మేకర్స్. ఈ సందర్భంగా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. మరోవైపు ఈ సినిమా ట్రైలర్‌ని నేడు 6.40 నిమిషాలకి జెమిని టీవీ వేదికగా లాంఛ్ చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఎంత వాడు గాని తర్వాత అజిత్- త్రిష కాంబినేషన్‌లో ఈ సినిమా రానుండటంతో మూవీ భారీ అంచనాలు ఉన్నాయి.



# 'సంక్రాంతికి వస్తున్నాం' క్రేజీ రెస్పాన్స్

విక్టరీ వెంకటేశ్ 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో థియేటర్లలో సందడి చేస్తున్నారు. దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కించిన ఈ సినిమా సంక్రాంతికి విడుదలై సూపర్ హిట్ టాక్?తో దూసుకుపోతోంది. రెండు రోజుల్లోనే ఈ సినిమా రూ.77 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. ఇక వీకెండ్?లో ఈ కలెక్షన్లు మరింత పెరిగే ఛాన్స్ ఉంది. సంక్రాంతి సెలవులు కావడం వల్ల థియేటర్‌కు ఫ్యామిలీ ఆడియెన్స్ క్యూ కడుతున్నారు. అన్ని థియేటర్లలో హౌస్ ఫుల్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. టికెట్లు దొరకక థియేటర్ నుంచి తిరిగి వెళ్లిపోతున్న ప్రేక్షకులూ కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మేకర్స్ కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో అదనంగా 220ం షోలను ప్రదర్శించాలని నిర్ణయించినట్లు మేకర్స్ పేర్కొన్నారు. సంక్రాంతి సెలవులకుతోడు వీకెండ్ కూడా కలిసి రావడం వల్ల మేకర్స్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. జనవరి 10న రిలీజైన 'గేమ్‌ఛేంజర్' సినిమా షోలను తగ్గించి 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు ఎక్స్‌ట్రా షోలు అడ్జెస్ట్ చేస్తున్నారు. అయితే ఈ రెండు సినిమాలకు నిర్మాత దిల్‌రాజు ఒక్కరే కావడం వల్ల స్క్రీన్‌లు పెంచే విషయంలో పెద్దగా సమస్యలు ఎదురు కాలేదని తెలుస్తోంది. దర్శకుడు అనిల్ రావిపూడి ఈ సినిమాను కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్? జానర్?లో తెరకెక్కించారు. ఈ చిత్రానికి అన్ని వర్గాల ప్రేక్షకులు ఫిదా అయిపోతున్నారు. ఈ సినిమాలో మీనాక్షి చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటిస్తుండగా, నరేశ్, వీటీ గణేశ్, సాయి కుమార్, మురళీ, పృథ్వీ రాజ్ తదితరులు ఆయా పాత్రలు పోషించారు. భీమ్స్? సిసిరొలియో సంగీతం అందించంగా, శ్రీ వేంకటేశ్వర బ్యానర్?పై దిల్?రాజు నిర్మించారు.

# చరణ్ కోసం బాబుని సాన పెడుతున్న బాబు

గ్లోబల్‌స్టార్ రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన 'ఆర్‌సీ16' వర్కింగ్ టైటిల్‌తో ఓ మూవీ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జాన్వీకపూర్ చరణ్ సరసన హీరోయిన్‌గా నటిస్తోంది. కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జగపతి బాబు ఆసక్తికర వీడియోని షేర్ చేశాడు.సినిమా టికెట్లు ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమాలో తన పాత్ర మేక్ ఓవర్ కి సంబంధించిన ఓ వీడియోని షేర్ చేస్తూ జగపతి బాబు.. "చాలాకాలం తర్వాత బుచ్చిబాబు ఆర్‌సీ 16 కోసం మంచి పని పెట్టాడు. గెటప్ చూసిన తర్వాత నాకు చాలా తృప్తిగా అనిపించింది" అంటూ క్యాప్షన్ పెట్టాడు. ఈ వీడియోలో జగపతి బాబు లుక్ ని చూసిన అభిమానులు తెగ సంబరపడిపోతూ కామెంట్స్ పెడుతున్నారు.

సినిమా టికెట్లు

ఒక గేమ్ బేస్డ్ గా తెరకెక్కుతున్న ఈ సినిమాని రక్తి కట్టించేలా బుచ్చిబాబు రూపొందిస్తున్నారు. మట్టి లాంటి కథ ఇదని ఇప్పటికే రామ్‌చరణ్ చెప్పారు. ఇప్పటి వరకూ చేసిన చిత్రాలో ఈ చిత్రం ది బెస్ట్ అవుతుందని కూడా ఆయన ఓ వేదికపై వెల్లడించారు. ఉప్పెనతో భారీ విజయం అందుకుని నేషనల్ అవార్డు అందుకున్న దర్శకుడు సాన బుచ్చిబాబు ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. పూర్తిస్థాయి కథతో పకడ్బందీగా సెట్స్ మీదకెళ్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. కాగా 'గేమ్ ఛేంజర్' సినిమా చెర్రీ ఫ్యాన్స్ ని కాస్త నిరాశపరచడంతో అందరు ఈ సినిమాపై భారీ ఆశలు పెట్టుకున్నారు.





# ట్రెండ్ సెట్ చేస్తున్న మక్కల్ 'సెల్వన్'

మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి లీడ్ రోల్ నటిస్తున్న స్పెషల్ గ్లింప్స్ విడుదలైంది. అరుముగకుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రుక్మిణి వసంత్, యోగి బాబు, బి.ఎస్. అవినాష్, దివ్య పిళ్లై, బబ్లు, రాజ్ కుమార్ కీలక పాత్రల్లో నటించారు.

కరణ్ భగత్ రౌత్ అద్భుతమైన సినిమాటోగ్రఫీ, జస్టిన్ ప్రభాకరన్ పవర్ ఫుల్ మ్యూజిక్ తో గ్రేట్ కమర్షియల్ ఎంటర్ టైనర్ గా ఉంటుందని హామీ ఇచ్చింది. ఎడిటింగ్‌ను ఫెన్నీ ఆలివర్, ఆర్ట్ డైరెక్టర్ ఎ.కె. ముత్తు నిర్వహిస్తున్నారు. 7 ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై అరుముగకుమార్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. సినిమా టైటిల్ టీజర్ విడుదలైన వెంటనే సంచలనం సృష్టించింది, మిలియన్ల వ్యూస్ సంపాదించి రికార్డులు సృష్టించింది. ఇప్పుడు, విజయ్ సేతుపతి పుట్టినరోజు సందర్భంగా, టీం ఈ ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసింది, ఇది అభిమానులలో మరింత ఉత్సాహాన్ని పెంచుతుంది. ఈ గ్లింప్స్‌లో విజయ్ సేతుపతి 'బోల్డ్ కన్నన్'గా సాంప్రదాయ తమిళ దుస్తులు ధరించి, మలేషియాలోని విమానాశ్రయంలో డైనమిక్ గా నడుస్తూ, హై-ఆక్టేన్ యాక్షన్ సన్నివేశాలలో పాల్గొంటూ, ఫెస్టివల్ లో డ్యాన్స్ చేస్తూ కనిపించడం అలరించింది. ఈ విజువల్స్ ఎంటర్ టైన్మెంట్, యాక్షన్ తో కూడిన సినిమాను సూచిస్తాయి, అభిమానులు విడుదల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. విజయ్ సేతుపతి 'బోల్డ్ కన్నన్' పాత్రను పోషించడం ఆసక్తిని రేకెత్తించింది, తన విలక్షణమైన నటనా ప్రతిభకు పేరుగాంచిన విజయ్ సేతుపతి భారతీయ ప్రేక్షకుల హృదయాలను దోచుకోవడమే కాకుండా చైనాలో కూడా అంతకు మించి భారీ అభిమానులను సంపాదించుకున్నారు.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,